కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 14 ఫిబ్రవరి 2026

## మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పీలేరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

స్థానిక శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణంతో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం గంగపూజ, గణపతి ఆరాధన, స్వస్తి పుణ్యాహవాచనం. కలశ స్థాపన, నవగ్రహ ఆరాధన, సాయంత్రం ధ్వజారోహణం, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయప్రధాన అర్చకులు విరూపాక్షం కుమార్ శాస్త్రి మాట్లాడుతూ శనివారం ఉదయం రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం, దుర్గా హోమం ఉంటాయన్నారు. అలాగే ఆదివారం ఉదయం రుద్రాభిషేకం, అలంకారం, మహామంగళ హారతి. తీర్థప్రసాద వినియోగం దర్శనం ఉంటాయన్నారు. అలాగే గిరిజా కల్యాణం, అన్నప్రసాద వితరణ. శివుడికి 108 లీటర్లతో పాలాభిషేకం. త్రిశూల స్నానం ఉంటాయని తెలిపారు. సోమవారం శివపార్వతుల గ్రామోత్సవం, ఊంజలసేవ, అన్నప్రసాద వితరణ. ధ్వజా ఆవరోహణం ఉటాయని తెలిపారు.

### నేడు రాజంపేటతో పాటు 6 మండలాల్లో

## విద్యుత్ అంతరాయం

### పునరుద్ధరణ పనులతో 2 నెలల పాటు విద్యుత్ అంతరాయం

రాజంపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

రాజంపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఆదివారం రాజంపేట, కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలు, పెనగలూరు మండలాలలో జరుగుతున్న పనుల వల్ల విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అలాగే డేట్ నుండి ఏప్రిల్ 10 వరకు 220 కెవి సబ్ స్టేషన్ రాజంపేట నందు రెండవ అదనపు కొత్త లైన్ ను 220 కేవి సబ్స్టేషన్‌కు అనుసంధానం చేయడం జరుగుతున్నది. ఈ వ్యవధిలో ఒకే లైన్ మీద విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు.ఇందులో ఏదైనా అనుకోని సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు నాలుగు లేదా ఐదు గంటలు విద్యుత్ సరఫరా లో అంతరాయం వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల వినియోగదారులు పై పనులు సజావుగా జరుగుటకు విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా కోరారు. రెండవ శనివారం సబ్ స్టేషన్ , లైన్లో మరమ్మతులు కారణంగా రాజంపేట, నందలూరు, పుల్లంపేట, మరియు కోడూరు మండలాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు.

# హంద్రీనీవా ప్రాజెక్టుపై అసెంబ్లీలో మంత్రి చర్చ

### రాయచోటికి హంద్రీనీవా జలాలు : సిఎం హామి

మదనపల్లె, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :



హంద్రీ-నీవా ప్రాజెక్టుపై శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటికి హంద్రీ-నీవా జలాలు ఇవ్వాలని సిఎం దృష్టికి తెచ్చారు. రాబోయే రోజుల్లో రాయచోటికి హంద్రీ-నీవా కాలువ ద్వారా క్రిష్ణాజలాలు అందిస్తామని సిఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాయచోటి ప్రజల నీటి అవసరాలపై సిఎం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. సిఎం హామీపై మంత్రి అభినందనలు తెలిపారు. హంద్రీ-నీవా ద్వారా రాయలసీమకు శాశ్వత నీటి ఎద్దడి పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందన్నారు. రాయలసీమ ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకే కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ఎడారి ప్రాంతంగా పేరుపొందిన రాయలసీమలోని ప్రతి చెరువుకు హంద్రీనీవా కాలువ ద్వారా ఇప్పటికే పలు చెరువులను నింపడం జరిగిందన్నారు. ప్రధానంగా ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంతోపాటు పుంగనూరు, మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని చెరువుల న్నీ హం ద్రీనీవా కాలువ ద్వారా నీళ్ళు నింపడం జరుగుతుందన్నారు. త్వరలోనే రాయచోటి నియోజ కవర్గంకు కూడా హం ద్రీనీవా జలాలు ఇచ్చి అక్కడి ప్రాంత ప్రజల నీటి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

# రెవెన్యూ ఆదాయ లక్ష్యాలను అదిగమించాలి

### జిఎస్‌టి వసూళ్ళు పక్కాగా జరగాలి : జిల్లాకలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మదనపల్లె, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

రాష్ట్ర ఖజానాకు రెవెన్యూను అందించే ఆదాయ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లాలో రాష్ట్ర ఖజానాకు అదాయాన్ని అందించే ఎక్సైజ్, వాణిజ్యపన్నులు, రవాణాశాఖ, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీశాఖ, పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖలకు ఆదాయవనరుల పెంపుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా, నకిలీ మద్యం అమ్మకాలు ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణా కాకుండా గట్టి నిఘా పెంచాలని వీటి అమ్మకాలు జరగడం వల్ల రాష్ట్ర ఖజానాకు గండిపడడమే కాకుండా ప్రజలు ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. జిఎస్‌టి వసూళ్ళపై పెండింగ్‌లో ఉన్న బకాయిలు, కేసుల వివరాలు అధికారులు అడిగి తెలుసుకొన్నారు. జిఎస్‌టి వసూళ్ళు పెంచాలని ఆదేశించారు. పన్ను ఎగవేతను అరికట్టేందుకు ప్రత్యేక ఇన్‌ఫోస్‌మెంటు వేను నిర్వహించాలన్నారు. మోటారు వెహికల్ షోరూములలో వాహనాల ధర పట్టికలో ఇన్వాయిస్ ధరను వినియోగదారులకు స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలన్నారు. రవాణశాఖ అధికారులు తరచుగా షోరూములను పర్యవేక్షించాలన్నారు. మైనింగ్ లీజులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం వెంటనే పునరుద్దరించి మైనింగ్ ప్రారంభించాలన్నారు. మున్సిపాలిటి, పంచాయితీలో సకాలంలో పన్నులు వసూలు చేయాలని జిల్లాలోని లేవుట్లపై తనిఖీలు నిర్వహించి అనధికార లేవుట్లపై జరిమానాలు విధించాలన్నారు. ప్రభుత్వ ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్కింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, రవాణా, పంచాయితీరాజ్, మైనింగ్, అటవీశాఖ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి

# బ్రహ్మోత్సవాలు ప్రారంభం





రాయచోటి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని మాండవ్య నది ఒడ్డున వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి ప్రారంభమై 23 తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ మనోజ్ కుమార్ మరియు ఆలయ ఈవో రమణారెడ్డి లు తెలియజేశారు. ఈరోజు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ వాయిద్యాలతో కర్ణాటక తమిళనాడు మహారాష్ట్ర మరియు రాయచోటి ప్రాంత భక్తులతో శాస్త్రవత్తంగా నాట్యం చేసుకుంటూ యాగశాల ప్రవేశం, శ్రీ మహాగణపతి పూజ, దీక్షా కంకణ ధారణ, ధ్వజారోహణ అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈనెల 13వ తేదీ ప్రారంభమై 14వ తేదీన కల్యాణోత్సవం సుమంగళి పూజ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివార్లకు రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఆలయ చైర్మన్ మనోజ్ కుమార్, ఆలయ ఈవో డివి రమణారెడ్డిలు తెలియ చేశారు . 18వ తేదీన చండీ హోమం పులి వాహన ఉత్సవం, 19వ తేదీన నందిమహోత్సవం, సూర్య ప్రభా ఉత్సవం 20వ తేదీన అగ్నిగుండ ప్రవేశం, మహా నైవేద్యం రథోత్సవం 21వ తేదీన మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, కంకణ విసర్జన 22వ తేదీన మహా సరస్వతి పూజ, రాత్రివేళ పారువేటి వాగు 23వ తేదీన ఆఖరి ఘట్టమైన ఉయ్యాల సేవ( డోలు ఉత్సవం )లు ఉంటాయని భక్తులందరూ స్వామివార్ల సేవలో పాల్గొని స్వామి వార్ల కృపకు పాత్రులు కాగలరని భక్తులను ఆలయ చైర్మన్ మనోజ్ కుమార్, ఈవో డివి రమణారెడ్డిలు తెలియజేశారు.

### ఇంటర్, టెన్త్ క్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను

# పకడ్బందీగా చేపట్టాలి





కడప, ఫిబ్రవరి 13 : ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను జిల్లాలో పటిష్టంగా చేపట్టాలని జేసీ డా. నిధి మీనా సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ పరీక్షల సన్నద్ధత, మహా శివరాత్రి ఉత్సవాలలో వసతులు, భద్రతా ఏర్పాట్లు, సానుకూల ప్రజా దృక్పథం, డాక్యుమెంట్ అప్‌లోడ్, కోర్టు బిల్డింగుల కోసం స్థల సేకరణ, కొత్త జిల్లాల్లో నూతన కోర్టు భవవనాల కోసం స్థల సమస్యలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూమ్ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరవ్వగా స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు. సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబందిత అధికారులతో జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలతో పాటు.. ప్రధానంగా పారదర్శకంగా పిజిఆర్ఎస్ అమలు, సజావుగా గ్యాస్ సరఫరా, నాణ్యమైన విద్యుత్ సరఫరా, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణీకులకు సంతృప్తికరమైన సేవలు అందించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో అన్ని రంగాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై ప్రతి వారం ప్రగతి నివేదికలను అందజేయాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను చేపట్టాలన్నారు. మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని 16 ప్రధాన శైవ క్షేత్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, ఎలాంటి కొరత లేకుండా వసతులను సమకూర్చేలా రెవెన్యూ, పోలీసు, దేవాదాయ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యం, పారిశుద్ధం, సీజనల్ వ్యాధులపై దృష్టి, మాధకద్రవ్యాల నిరోధం, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు.. తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవో కార్యాలయంలో ఏసీబీ ఉచ్చు

### రూ.10 వేలు లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసిల్దార్ అరెస్ట్

### మసీదు ఈనాం భూముల కేసులో అవినీతి బండారం బహిర్గతం

పులివెందుల ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :



పట్టు పడ్డ డిప్యూటీ తహసిల్దార్





ఏసీబీ డీఎస్పీ సీతారామారావు

పులివెందులలోనీ ఆర్డీఓ కార్యాలయం నందు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించి, లంచం స్వీకరిస్తున్న డిప్యూటీ తహసిల్దార్ నాగేంద్ర కుమార్ బాబును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.10 వేల లంచం తీసుకుంటున్న సమయంలో అధికారిని అదుపులోకి తీసుకుని నగదు, సంబంధిత ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు.అవినీతి నిరోధక శాఖ అధికారులు కడప డీఎస్పీ సీతారామారావు నేతృత్వం లో ఈ ఆపరేషన్ నిర్వహిం చారు.చక్రాయపేట మండలంలోని ఖాద్రియ మసీదు కు చెందిన సుమారు 40 ఎకరాల ఈనాం భూముల విషయంలో పాసుబుక్కులు రద్దు చేసి భూములను తిరిగి మసీదు పేరున మార్చాలంటే రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితుడు కరిముల్లా ఫిర్యాదు చేశాడు. పిర్యాదు మేరకు దీంతో ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.అరెస్టు చేసిన అధికారిని విచారణ అనంతరం కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ వ్యవహారంలో మరెవరైనా అధికారుల ప్రమేయం ఉందా అన్న దిశగా దర్యాప్తు కొనసాగుతోం దన్నారు. 24 గంటలు ఏసీబీ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుంది అని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే 9440446191 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు పిలుపునిచ్చారు.

### మహాశివరాత్రి ఉత్సవాలకు

## ముస్తాబవుతున్న నేలమల్లేశ్వరస్వామి ఆలయం

నిమ్మనపల్లె, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :



మండలం తవళం గ్రామం నందు వెలసిన శ్రీనేలమల్లేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి సందర్భంగా సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. భక్తులకు సులభ దర్శనం కల్పించడానికి అవసరమైన క్యూలైన్లు ఏర్పాటు, మంచినీటి సదుపాయాలు, శానిటేషన్ పనులు షామియానాలు, విద్యుత్ దీపాలంకరణ మొదలగు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం త్రికలాబిషేకములు, రాత్రి లింగోదర్బవ అభిషేకం, రాత్రి 7గంటలకు శ్రీకామేశ్వరి సమేత నేల మల్లేశ్వర స్వామి కళ్యాణోత్సవం, సోమవారం ఉదయం 9గంటలకు దేవరెద్దులు నాణ్యములతో రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగును. భక్తాదులు అందరూ విచ్చేసి స్వామి కృపా కటాక్షములు పొందాలని తెలిపారు. ఆ దేవస్థానం తాత్కాలిక ఛైర్మెన్ మేసా రామక్రిష్ణ అకాల మరణం సందర్భంగా ఏకైక కుమారుడు మేసా రెడ్డిమోహన్‌కు ప్రభుత్వం తరపున, టిడిపి నాయకులు తరపున ఛైర్మెన్ సీటు ఖాయం కానున్నది. ఇతని ఆధ్వర్యంలో ఘనంగా శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. అదే విధంగా ఎస్ఐ రామక్రిష్ణ, మండల పార్టీ అధ్యక్షులు రాజన్నల సేవలు మరువరానివని తెలిపారు. దాతల సహకారంతో చిన్నరెడ్డప్పరెడ్డి, చంద్రారెడ్డి, కె.రెడ్డప్ప, సర్పంచ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మంజుల పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమం



రాజంపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

రాజంపేట ఏరియా ఆసుపత్రిలో స్పర్శ కుష్టు వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ కుష్టు వ్యాధి నివారణ అవగాహన పక్షోత్సవాలు కుష్టు వ్యాధి వార్డు ఆవరణంలో డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. డిప్యూటీ డీ. యం . అండ్ హెచ్ ఓ డాక్టర్ చిన్ని కృష్ణ, డాక్టర్ మనోహర్ జిల్లా లేపరసి ఆఫీసర్ మహాత్మా గాంధీ కి జ్యోతి ప్రజ్వలన చేసి,మాట్లాడుతూ కుష్టు వ్యాధి సాధారన చర్మ వ్యాధి అని, చికిత్స చేయడం సులభతరం అని ఎవరు భయ పడాల్సిన అవసరం లేదని తెలిపారు. శరీరము పై స్పర్శ లేని మచ్చలు లేక పొడలు ఎరుపు రంగు రాగి రంగుమచ్చలు ఎవరి మీద ఉన్నాయో వారు ప్రభుత్వ ఆస్పత్రులకు పోయి పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు. తద్వారా అంగ వైకల్యంను అరికట్ట వచ్చునని , మందులు మరియు పరీక్షలు ఫ్రీ గా ఉంటాయని తెలిపారు. డీ. బి. గురప్ప లేపరసి వార్డు ఫిజియోథెరపోస్టు మాటలాడుతూ కుష్టు వ్యాధి నివారణ చర్యలకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది అని ప్రతి ఒక్కరు కుష్టువ్యాధి పై అవగాహన కల్గి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో దాతలు చెంగలరాయులు కుటుంబ సభ్యులు చీరలు, పంచలు, అన్నదానం దాతలు డి. మధు సూదన రాజు ఫ్యామిలీ, జగన్ మోహన రాజు ఫ్యామిలీ మరియు రామక్రిష్ణ రాజు ఫ్యామిలీ యాభై మందికి చేశారు. ఈ కార్యక్రమంలో చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ అనిల్ కుమార్ , ల్యాబ్ టెక్నిక్ ఆఫీసర్ శ్రీనివాస్ రాజు, సిద్ధ రామయ్య సార్, నారాయణ సార్, టీ. బి. కో ఆర్డినేటర్ ప్రకాశ్ స్టాఫ్‌నర్సులు శైలజ, అనురాధ, రోగులు యాభై మందికి పైగా పాల్గొన్నారు.

## నిందితునికి జైలు శిక్ష, జరిమానా

దువ్వూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:



మండల పరిధిలోని చింతకుంట చెరువు వద్ద 30 ఆగస్టు నెల 2017లో జరిగిన ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితునికి 5 సంవత్సరాల జైలు శిక్ష, 1000 రూపాయల జరిమానాను విధించినట్లు ఎస్ఐ ధనుంజయుడు పేర్కొన్నారు. 2017లో జరిగిన ఈ సంఘటనలో చింతకుంట చెరువు వద్ద దువ్వూరుకు చెందిన జయ లక్ష్మమ్మను కూలి డబ్బు విషయంపై మైదుకూరు మండలం గడ్డమవారి పల్లెకు చెందిన నారీ గంగాధర్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించడంతో అప్పట్లో పనిచేస్తున్న ఎస్ఐ విద్యాసాగర్ కేసు నమోదు చేశారు. ఈ కేసు కడప ఎస్సీ, ఎస్టీ కేసులో వాదోప వాదాలు జరిగి శుక్రవారం తీర్పును న్యాయమూర్తి దీనబాబు ఇచ్చారు. ఈ కేసులో నిందితునికి 5 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున న్యాయవాది బాలాజీ అలాగే సిబ్బంది సుబ్బరాయుడు, లక్ష్మీపతి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి లను జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.

## ఆంజనేయ స్వామి ఉత్సవం



పీలేరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

మండల పరిధిలోని వేపుల బైలు పంచాయతీ పరిధిలోని మాజీ ఎంపిటీసీ సభ్యులు నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో స్వంత ఖర్చులతో ప్రధాన రహదారి సమీపంలో ఆంజనేయ స్వామి ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుతుండటం హర్షించదగ్గ విషయం అదే విధంగా శుక్రవారం మహాశివరాత్రి పండగను పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఉత్సవాలను ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకున్న దానిలో భగవంతుడిని కొలిచేందుకు లక్షల రూపాయలు ఇచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని ప్రతి ఏటా భక్తాదులకు అన్నదాన కార్యక్రమాల తోపాటు పూజా కార్యక్రమాలు చెక్కభజనలతో ఘనంగా నిర్వహించడం ఆనవాయితుగా వస్తుందని ఇకపై జరిపిస్తామని నాగభూషణం రెడ్డి తెలిపారు.

## కంటి అద్దాలు పంపిణీ

దువ్వూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:

మండల పరిధిలోని తెల్లబసాయి పల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. వీటిని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ అలాగే వైద్యాధికారులు సురేష్ బాబు, రోషిని, కంటి వైద్య సహాయకుడు చంద్రమోళి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఆందత్వ నివారణలో భాగంగా వీటిని పంపిణీ చేశామని, హైస్కూల్ లో 14మంది విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. కంటి ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే అదే గ్రామంలో నేచర్ స్వచ్ఛంద సంస్థ ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 209 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమ్యప్రియ, కల్పన, పూజిత, ప్రభంజన్, వైద్య సిబ్బంది రాజగోపాల్, హెచ్ఎం షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి

### 500 మంది పోలీస్ బందోబస్తు, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

ఈనెల 17 18 19 తేదీలలో జరగబోవు గంగమ్మ జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు శుక్రవారం గంగమ్మ జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు .ఈ సందర్భంగా ముందుగా అమ్మవారిని దర్శనం చేసుకొని అర్చకులు ఆదమూలం ప్రతి శేఖర్ రామచంద్రన్ ఎస్పీనీ ఆహ్వానం పలికి పూజలు నిర్వహించారు అనంతరం జాతర ప్రాంగణమంతా పరిశీలించి విలేకరులతో మాట్లాడారు స్త్రీలకు ప్రత్యేక స్థానపు గదులు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని దేవాలయ శాఖ వారికి ఆదేశించారు అంతేకాకుండా ఈ ఏడాది ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలక్కుండా అందరికీ అమ్మవారు దర్శనం అయ్యేటట్టు చేస్తామన్నారు గతంలో కొన్న ఈ ఏడాది పోలీస్ బందోబస్తు 500 మంది పైగా ఏర్పాటు చేస్తామన్నారు అంతేకాకుండా జాతర ప్రాంగణం అంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు చిన్న పిల్లలకు తప్పిపోకుండా క్యూలైన్లో ట్యాబులు ఏర్పాటు చేసి ఫోన్ నెంబర్లు అతికించి పంపిస్తామన్నారు చిన్న పిల్లలు ఎవరైనా తప్పిపోయిన వెంటనే వారు తల్లిదండ్రులు చేరుకున్నట్టు చూస్తామన్నారు అంతే కాకుండా జాతరకు వచ్చే భక్తులకు పోలీసు జాగ్రత్తగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నాలుగు రూట్లల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నాలుగు ప్రాంతాలలో పార్కింగ్లు ఏర్పాటు చేస్తామన్నారు . జాతరలో ఆడవాళ్ళ పైన అల్లరి మూకలు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్ప ఉన్నారు మూడు రోజులు గంగమ్మ జాతర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో డిఎస్పి కృష్ణమోహన్ సిఐలు కృష్ణంరాజు నాయక్ ఎస్ఐలు గోల్కొండ శోభ ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు ఈవో శ్రీనివాసులు మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ఉమామహేశ్వరుని దర్శనం.. సర్వపాప హరణం

**గాలివీడు, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త):** అంతులేని ఆహ్లాదం మైమరిపించే ప్రకృతి సోయగాలు, కనువిందు చేసే జలపాతాలు.. వీటన్నిటికీ ప్రతిరూపంగా నిలుస్తోంది గండిమడుగు పుణ్యక్షేత్రం. ప్రకృతి రమణీయతతో పాటు ఆధ్యాత్మిక చింతనను కలగజేసే శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని వెలిగల్లు గ్రామ పరిధిలో వెలిగల్లు జలాశయం దిగువ భాగంలో రెండు కొండల నడుమ పాపాగ్ని నది తీరాన ఈ ఆలయం వెలసి ఉంది.





**స్థలపురాణం:** శ్వేతవర్ణ పాలరాతి లింగాకారంలో వెలసిన శివుడు ఇక్కడ శ్రీ ఉమామహేశ్వర స్వామిగా పూజలందుకుంటున్నాడు. పాపాగ్నినదీ తీరంలో శ్రీ అగస్త్య మహాముని ఈ లింగాన్ని ప్రతిష్టించాడనే పురాణ ప్రస్తావన ఉంది. మహాశివరాత్రి, కార్తీక మాసం, శ్రావణ మాసం, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

**దర్శనీయ స్థలాలు:** ప్రధాన దైవం ఉమామహేశ్వర స్వామితో పాటు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, అక్కదేవతలు, నవగ్రహాలు, ఆలయం దిగువన గంగమ్మ, నాగమ్మ ఆలయాలు ఉన్నాయి. శివాలయం పైభాగంలో కొండపై ఉన్న గుహ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గతంలో ఋషులు ఇక్కడ ధ్యానం చేసేవారని, గుహలో నాగసర్పం ఉండేదని, అక్కడి నుండి గండి ఆంజనేయ స్వామి ఆలయానికి మార్గం ఉందని భక్తులు నమ్మకం.

**భక్తుల విశ్వాసం:** అనారోగ్య, మానసిక, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు వంటి బాధలతో బాదపడేవారు స్వామి వారిని దర్శిస్తే ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం. ముఖ్యంగా పౌర్ణమి, అమావాస్య రోజుల్లో అక్కదేవతల పూజలు చేస్తే చెడు సంబంధిత మానసిక వ్యాధుల నుండి విముక్తి లభిస్తుందని విశ్వసిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

**ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం:** కొండల నడుమ పచ్చని చెట్ల మధ్య కాలినడకన వెళ్లి పాపాగ్ని నదిలో స్నానం చేసి స్వామి వారిని దర్శించుకోవడం భక్తులకు వర్ణనాతీత అనుభూతిని కలిగిస్తోంది. చుట్టూ కొండలు, మధ్యలో జలపాతాలు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సమీపంలోని వెలిగల్లు జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతుండగా, పక్కనే ఉన్న ఉద్యానవనం పర్యాటకులతో కిక్కిరిసిపోతుంది.

**మహాశివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు:** ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తుల కోసం క్యూ లైన్లు, బారికేడ్లు, అన్నప్రసాద వితరణ, జాగరణ భక్తుల కోసం కోలాటం, చెంచునాటకం, హరికథా కాలక్షేపం కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. శివరాత్రి రోజున స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించనున్నారు.

**ఎలా చేరుకోవాలి:**

గండిమడుగు పుణ్యక్షేత్రం గాలివీడుకు సుమారు 3 కిలోమీటర్ల దూరంలో వెలిగల్లు జలాశయానికి ఆనుకుని ఉంది. కదిరి, రాయచోటి ప్రధాన రహదారిపై రాయచోటికి 30 కిమీ, కదిరి నుండి 34కిమీ దూరంలో ఈ క్షేత్రం ఉంది. బస్సు సౌకర్యం సమృద్ధిగా ఉండటంతో పాటు సొంత వాహనాల్లో కూడా సులభంగా చేరుకోవచ్చు.

# పట్టణంలో మెరుగైన పోలీస్ సేవలు అందించాలి

**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** బద్వేల్ అర్బన్ సిఐగా రామకృష్ణ, ఎస్సైగా కొండారెడ్డి బాధ్యతలు చేపట్టారు,శుక్రవారం ఉదయం అర్బన్ సీఐ రామకృష్ణ, అర్బన్ ఎస్ఐ కొండారెడ్డి లను మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె,వి సుబ్బారావు, శ్రీ వేంకటేశ్వర స్వామి అభయ, ఆంజనేయస్వామి దేవాలయం నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ,మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్,సురేష్ లాడ్జి తుమ్మలపెంట సురేష్ బాబు,మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ మెంబర్ జొన్నలగడ్డ సుధాకర్ (వస్త్రం) బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ కొలిశెట్టి పవన్ కుమార్, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ చిన్ని సుబ్బారావు, బలిజ సేవా సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, తోపాటు పలువురు నాయకులు వ్యాపారస్తులు పుర ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించి ఫ్రూట్స్, స్వీట్ బాక్స్ అందజేసి వారికి అభినందనలు తెలియజేశారు, గతంలో బద్వేల్ పట్టణం లో అర్బన్ ఎస్ఐగా విధులు నిర్వహించారు, అయితే చాలా సంవత్సరాలు తరువాత సిఐగా రామకృష్ణ మరో సారి ఇక్కడ బాధ్యతలు చేపట్టడంతో అందరికీ పరిచయస్తుడు కాబట్టి పట్టణంలోని అనేకమంది మర్యాదపూర్వకంగా వారిని కలిసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు,బద్వేల్ పట్టణంలో ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విధంగా కృషి చేయాలని పలువురు కోరారు,ఈ కార్యక్రమంలో పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు, పలువురు పోలీస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.





## ఆలయంలో భద్రత కట్టుదిట్టం

**రామసముద్రం పిబ్రవరి 13 ప్రభాతవార్త**

మండలంలోని ఆర్ నడింపల్లె గ్రామ పంచాయతీ బల్లసముద్రం గ్రామసమీపంలో కొండలో కొలువైన శ్రీ వాళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి నట్లు ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు రోజులు పాటు వాళీశ్వర స్వామి ఆలయానికి మా సిబ్బంది తో కలిసి కొండకు నడక దారిలో వెళ్లి ఆలయ పరిసరారాలను క్షుణ్ణం గా పరిశీలించామని,క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భక్తులకు పోలీస్ బందొబస్త్ ఏర్పాట్లు చేస్తామన్నారు, ఎవ్వరైనా ఆకతాయులు మిమ్మల్ని ఏదైనా ఘోరవ్ చేస్తే పోలీస్ ఫోన్ చేయాలన్నారు. కొండదగ్గర అక్కడ అక్కడ సీసీ కెమెరాలు పెడతా మని చెప్పారు.

## ఫాతేహా కార్యక్రమంలో ఆరిఫుల్లా హుస్సేనీ

**చిన్నమండెం పిబ్రవరి 13 ప్రభాత వార్త:**

మండల కేంద్రంలో జరుగుతున్న హజరత్ షా ఆలీ ఘంజే హజరత్ బాబా రహమతుల్లా ఇలైహి దర్గా ఉరుసులో గంధము సందర్భంగా గురువారం రాత్రి కడప దర్గా గురువు హజరత్ ఖ్వాజీ సయ్యద్ షా ఆరిఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుస్సేనీ చిష్టివుల్ ఖాదరి పాల్గొని పాతేహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి 9 గంటలకు నాయబ్ సాబ్ గృహంనుండి మెరవనిగా బయలు దేరి దర్గాలో ప్రార్ధనలు చేసి పాతేహ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ్ సినిమా హీరో రాయలసీమ భారత్ పాల్గొని ప్రార్ధనలు చేశాడు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కవ్వాలి పోటీలు నిర్వహించారు.

## ఆర్థిక స్వాలంబన కోసం బ్యాంకులు సహకరించాలి

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 13 ప్రభాతవార్త::**

నియోజకవర్గపరిధిలోని బ్యాంకులు రైతులు, మహిళ సంఘాలు, కక్షిదారులు, పారిశ్రామికవేత్తల ఆర్థిక స్వాలంబన కోసం సహకరించాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి ఆంజనేయులు సూచించారు. శుక్రవారం ఐకెపి కార్యాలయంలో త్రైమాసిక ఆర్థిక లావాదేవీల పై బ్యాంకు అధికారులు, పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు మాసాల రైతులు, మహిళా సంఘాలు, ఇతరత్రా రుణాల పంపిణీ, రికవరీలపై ఆరా తీశారు. బ్యాంకు లింకేజీలు, కిసాన్ కార్డులు, పశు కిసాన్ కార్డులు,రబీ క్రాప్ ఇన్సూరెన్స్, సి సి ఆర్ సి, ఉదయం రిజిస్ట్రేషన్, తోబాటు పిఎం ఈజీపి, పి ఎం ఎం వై, పీఎం సూర్య ఘర్ మఫ్ట్ బిజిలి యోజన, పీ ఎం విశ్వకర్మ, ముద్ర హ్యాండ్లూమ్ రుణాలు, పి యం డిడి కే వై మరియు పీ ఎం స్వనిధి పథకాల రుణాలపై వివరణ అడిగారు. అదేవిధంగా బ్యాంకులకు సంబంధించి సైబర్ నేరాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వపరంగా అర్హులైన వారికి రుణ పంపిణీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ప్రసాద్ రెడ్డి వ్యవసాయ అధికారి రమణ కుమార్, ఐకెపి ఎపిఎం గంగాధర్, నియోజకవర్గంలోని బ్యాంకు మేనేజర్లు, పశు వైద్య జె.వి.ఓ కిరణ్, వ్యవసాయ శాఖ ఏఈఓ సురేష్, సి.సి.లు కత్తి నరసింహులు, రమణ, అధికారులు పాల్గొన్నారు.

## జగన్ అసెంబ్లీకి వెళ్లకపోవడం మూర్ఖత్వానికి పరాకాష్ట

**వేంపల్లి:ఫిబ్రవరి 13(ప్రభాత వార్త)**



నా గొంతు నొక్కెందుకే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వడం లేదు,అందుకే అసెంబ్లీకి వెళ్లడం లేదు అని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు శాసనసభ్యుడు జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదం, అవివేకం, అజ్ఞానం, బాధ్యతారాహిత్యం పిరికితనం అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మెన్ డాక్టర్ నర్రెడ్డీ తులసి రెడ్డి ధజమెత్తారు. శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్ వ్యాఖ్యలు మూర్ఖత్వానికి పరాకాష్ట అన్నారు. ఈ వ్యాఖ్యలు సెల్ఫ్ గోల్ కొట్టుకోవడమే అన్నారు. అసెంబ్లీ నియమ నిబంధనలు ,సాంప్రదాయాల ప్రకారం ఒక పార్టీకి ప్రతిపక్ష పార్టీ హోదా ఇవ్వాలి అంటే మొత్తం శాసనసభ సభ్యుల సంఖ్యలో 10 శాతం సభ్యులు ఆ పార్టీకి ఉండాలి . అప్పుడు ఆ పార్టీ నాయకునికి ప్రతిపక్ష నాయకుని హోదా లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మొత్తము శాసనసభ్యుల సంఖ్య 175. అందులో 10 శాతం రావాలి . అంటే 18 మంది ఉండాలి.కానీ వైకాపా పార్టీకి 11 మంది ఉన్నారు.ఏడు మంది తక్కువ ఉన్నారు. కాబట్టి ఆ పార్టీకి ప్రతిపక్ష పార్టీ హోదారాదు. జగన్ కు ప్రతిపక్ష నాయకుని హోదా రాదు. ఈ విషయం జగన్ కు తెలుసు.అయినా మంకు పట్టు పట్టడం అంటే పిల్ల చేష్టే అవుతుంది. పులివెందుల నియోజకవర్గ ప్రజలు తమ ఎమ్మెల్యేగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించారు. ముఖ్యమంత్రిగా కాదు.ప్రతిపక్ష నాయకుడిగా కాదు.ఈ వాస్తవాన్ని జగన్ గ్రహించాలి. అదేవిధంగా వైకాపా పార్టీకి చెందిన మిగతా ఎమ్మెల్యేలు కూడా ఆలోచించాలి.

## సింగిల్ విండో అధ్యక్షులుగా గజ్జల సీతప్ప నియామకం

**రామసముద్రం పిబ్రవరి 13 ప్రభాత వార్త**



మండల సింగిల్ విండో అధ్యక్షులుగా గజ్జల సీతప్ప నియామకమయ్యారు. చెంబకూరు గ్రామపంచాయతీ, బలిజపల్లి గ్రామానికి చెందిన సీతప్ప తెలుగుదేశం పార్టీలో కీలక నాయకుడిగా ఉంటున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేశారు. ఇతనిపై దాడులకు సైతం ప్రయత్నించారు. అయినా భయపడకుండా తెలుగు దేశం పార్టీని రామసముద్రం మండలంలో బలోపేతం చేసేందుకు తీవ్రంగా కృషి చేశారు. ఇతని సేవలను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, ఎమ్మెల్యే షాజహాన్ భాష, ఇతర టిడిపి ముఖ్య నాయకులు సీతప్పను సింగల్ విండో అధ్యక్షులుగా నియమించడంలో కృషి చేశారు. తన నియామకంపై కృషి చేసిన ప్రతి ఒక్కరికి సీతప్ప కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రపంచ రేడియో దినోత్సవం

**కురబలకోట ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**



మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు మిట్స్ 90.8 కమ్యూనిటీ రేడియో ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రేడియో దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ మాట్లాడుతూ మన యూనివర్సిటీ యాజమాన్యం కమ్యూనిటీ రేడియో ను ప్రారంభించడం ద్వారా విద్యార్థులు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, సిగ్నల్ ప్రాసెసింగ్, ఆడియో టెక్నాలజీ వంటి అంశాలలో ప్రత్యక్ష అనుభవం పొందడంతో వారి సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మిట్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ టి.జి రవి కుమార్, ప్రోగ్రామ్ మేనేజర్ నరసింహ చార్యు,ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేష్,టెక్నికల్ కోఆర్డినేటర్ అరవింద్ రాజ్,స్టేషన్ కోఆర్డినేటర్ సతీశ్ ఫ్యాకల్టీ మెంబర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచి అధికారిని వేయకపోతే ధర్నా చేస్తాం

**వేంపల్లె:ఫిబ్రవరి 13(ప్రభాత వార్త)**

వేంపల్లె గ్రామ పంచాయతీకి మంచి అధికారిని వేయాలని లేకపోతే జిల్లా కలెక్టరేట్ వద్ద కూటమి నేతలు అందరూ కలిసి ధర్నా చేస్తామని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గ్రేడ్ 1 పంచాయతీ అయిన వేంపల్లెకు గ్రేడ్ 3 పంచాయతీ అధికారిని నియమించడంతో గ్రామం సర్వనాశనం అయ్యిందని చెప్పారు. అలాగే పంచాయతీ కూడా అవినీతి మయం కావడం జరిగిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీని కాపాడేందుకు జిల్లా కలెక్టర్, డిపిఓ మంచి అధికారిని నియమించాలని కోరారు. సోమవారంలోపు పంచాయతీకి అధికారిని వేయకపోతే కూటమి నేతలతో పాటు పంచాయతీలో పని చేసే కార్మికులతో కలిసి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరి ప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, నాయకులు డక్కారమేష్, మహమ్మద్, బాబు, తక్కెల షరీఫ్, మదార్ పాల్గొన్నారు.

## సమాజానికి విద్యార్థులు రోల్ మోడల్

**వేంపల్లె:ఫిబ్రవరి13(ప్రభాత వార్త)**

సమాజానికి రోల్ మోడల్ గా ప్రభుత్వ ఉర్దూ కళాశాలకు చెందిన ప్రతి విద్యార్థి నిలవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అన్నమయ్య deo రవి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును మార్చేదే తరగతిగది అన్నారు. ప్రతి విద్యార్థి జీవన విధానం అనేది నేర్చుకోవాలని కోరారు. యువత దేశానికి అవసరం కాబట్టి బాధ్యత రాహిత్యం అనేదిలేక పోతే సమాజం అభివృద్ధి జరగదన్నారు. జీవితంలో మచ్చలేకుండా జీవించాలని, క్రమశిక్షణ అనేది ప్రతివిద్యార్థికి ముఖ్యమన్నారు. లక్ష్యం అనేది ప్రతివిద్యార్థిలో ఉండాలని, క్రమశిక్షణ లేని జీవితం వెన్నముక్క లేని జీవితం లాంటిదన్నారు. తల్లిదండ్రులను నచ్చజెప్పి నేను చదువు కొంటానని విద్యార్థులు భరోసా ఇవ్వాలని కోరారు. ఇంటర్ పూర్తి అయిన తర్వాత పెళ్లి ఆలోచన పెట్టుకోకుండా ఉన్నతమైన విద్యాను చదువుకోవాలని చెప్పారు. క్వాంటం సాంకేతికతల రంగంలో విద్యార్థులు రాణించాలని, భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం ఉంది అంటే అది భారత దేశం ఒక్కటే అన్నారు.

# అరటి తోట దగ్ధం - రూ.15 లక్షల నష్టం

**పులివెందుల, ఫిబ్రవరి 13, ప్రభాత వార్త :**



పులివెందుల మండల పరిధిలోని ఈ కొత్తపల్లి గ్రామంలో అరటి తోట అగ్నికి ఆహుతై రైతుకు భారీ నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు రామన్న ఓవయ్యకు చెందిన సుమారు నాలుగు వేల అరటి చెట్లు మంటల్లో దగ్ధమయ్యాయి. తొలి గల కూడా వేయకముందే తోట పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.15 లక్షల మేర నష్టం జరిగినట్లు రైతు వాపోతున్నారు. డ్రిప్ వైరు తో పాటు మోటారు కూడా కాలిపోవడంతో మరో ఐదు లక్షలు నష్టం వాటిల్లింది. గుర్తుతెలియని వ్యక్తులు సమీప కొండ ప్రాంతంలో అగ్గి పెట్టడంతో మంటలు వ్యాపించి అరటి తోటను చుట్టుముట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాపించడంతో తోట మొత్తం కాలిపోయింది.అగ్నిమాపక శాఖ అధికారులకు సమా చారం ఇచ్చినా, వస్తామని చెప్పి రాలేదని రైతు ఆరోపించారు. అధికారులు సమయానికి స్పందించి ఉంటే కనీసం కొంత వరకు నష్టం తగ్గించుకునే అవకాశం ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.నిర్లక్ష్యం వహించిన అగ్నిమాపక అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు. కష్టపడి సాగు చేసిన పంట ఒక్కసారిగా బూడిద కావడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడిందని రామన్న ఓవయ్య తెలిపారు. ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన మొర పెట్టుకున్నారు. గ్రామస్తులు కూడా ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే నష్టపోయిన రైతుకు తక్షణ సాయం అందించాలని అధికారులను కోరుతున్నారు.

## బోయకొండలో జూనియర్ అసిస్టెంట్‌పై వేటు

**బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

శక్తిక్షేత్రం బోయకొండ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ని విధుల నుంచి తొలగిస్తూ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఉత్తర్వులు జారీ చేసారు. ఆయన కథనం మేరకు...అమ్మవారి కార్యాలయంలో ఒప్పంద కార్మికురాలిగా పనిచేస్తోంది. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా వుంటూ రణభేరీ గంగమ్మ ఆలయ ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తోంది. ఈక్రమంలో నవంబర్ 2న రణభేరీ గంగమ్మ ఆలయంలో అర్చకుని నుంచి కొంతమేర నగదు తీసుకొని వారితో కుమ్మక్కు అయినట్లుగా ఆమెపై ఫిర్యాదు అందినట్లు ఏకాంబరం తెలిపారు. ఈమేరకు మెమో ఇచ్చామనీ, అయితే జూనియర్ అసిస్టెంట్ ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేనందున విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్లు ఆయన వివరించారు.

## యూరియా వాడకంపై అవగాహన

**దువ్వూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**



మండల పరిధిలో రబి సీజన్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జ, మినుము, నువ్వుల పంటలకు అధికంగా యూరియా వాడుతున్నారని దానివల్ల పంట దిగుబడి తగ్గి నష్టాలు వస్తాయని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం యూరియా వాడకంపై వ్యవసాయ శాఖ రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా యూరియా వాడటం వల్ల పైరు పచ్చగా పెరుగుతుందని అంతే తప్ప దీనివల్ల తెగుళ్ల అధికంగా వస్తాయన్నారు. నాణ్యత దిగుబడి తగ్గుతుందని పంట నిల్వ సామర్థం తగ్గి పోతుందన్నారు. అలాగే నేలపై ప్రభావం చూపి సూక్ష్మ జీవులు చనిపోతాయని భూమి చౌడుగా మారుతుంది అన్నారు. అలాగే భూగర్భ జలాలు కాలుష్యం అయి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అందువల్ల రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని వాటి నివేదిక ఆధారంగా ఏ ఏ పోషక విలువలు వాడాలో వాటి ప్రకారం రసానికిక ఎరువులు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రామ కృష్ణ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ అక్రమనదారులపై ఉక్కు పాదం

**పీలేరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త;**




పీలేరు మండల పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపుతామని తహశీల్దారు శివకుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీలేరు మండలం, ఎర్రగుంటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 646/2ఎ ఆక్రమణక గురైన సుమారు ఎకరా కుపైగా ప్రభుత్వ భూమిని స్థానిక వీఆర్ఓ ఇమ్రాన్ ఖాన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురుగేష్, సర్వేయర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్న వారిని గుర్తించి, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని అందులో అది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు చెప్పారు. అదే విధంగా ఇప్పటికే మండల పరిధిలోని అక్రమదారులకు ఎన్నోసార్లు ఈ విషయాన్ని గుర్తుచేశామని, ఇకపై ఎవరైనా ప్రభుత్వ భూముల్లోకి అధికారుల అనుమతి లేకుండా ప్రవేశించకూడదని తెలియజేశారు. అలాగే సదరు భూములకు సంబంధించిన ఏవైనా రికార్డులు ఉంటే తమను సంప్రదించాలని అన్నారు. పీలేరు మండల పరిధిలో ఇప్పటికే రెవెన్యూ డివిజన్ కార్యాలయం వచ్చిందని, త్వరలో మున్సిపాలిటీ కూడా రాబోతుండటంతో ఇక్కడ భూములకు అత్యధిక ధరలు పలుకులు ఉన్నాయి. దీంతో అక్రమదారుల కన్ను ప్రభుత్వ భూములపై పడిందని, ఇకనైనా ఆక్రమణలకు పాల్పడడం మానుకోకపోతే ప్రభుత్వపరంగా ఎలాంటి చర్యల కైనా చర్యలకైన తాము సిద్ధమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురగయ్య, రెవెన్యూ అధికారి ఇమ్రాన్ ఖాన్, రెవెన్యూ సర్వేయర్ కిరణ్ తో పాటు రెవెన్యూ, పోలీసు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా విశ్వబ్రాహ్మణ విభాగం ప్రెసిడెంట్

**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త::**



మండల కేంద్రంలో ఉన్నటువంటి మాజీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గొడ్ల వీటి సుబ్రహ్మణ్యం ను వైయస్సార్ సిపి అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించడం జరిగినది, ఈ నియామకానికి సహకరించిన మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, వైయస్ ఆర్సీపీజిల్లా ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ రెడ్డి గారికి, నా ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు ఈ సందర్భంగా గొడ్లవీటి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎల్లప్పుడూ విశ్వబ్రాహ్మణ విభాగం సంబంధించిన అందరికీ చేదోడు వాదోడుగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడతారని వైఎస్ ఆర్సిపి నాయకులకు కార్యకర్తలకు చేదోడు వాదోడుగా ఉంటూ అందరిని కలుపుకుని ముందుకు వెళ్తానని నాకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు.

## ప్రొద్దుటూరు అభివృద్ధికి నిధులు కోరిన ఎమ్మెల్యే

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి శుక్రవారం అసెంబ్లీ సాక్షిగా, మంత్రిని కలిసి నిధులు కోరారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా రాష్ట్ర వెలగపూడి సచివాలయం లో పురపాలక శాఖ మంత్రి నారాయణని కలిసి ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. పట్టణం నందు జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులు గురించి చర్చించి ,ప్రొద్దుటూరు నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆయన శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో అసెంబ్లీలో మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణాన్ని ప్రస్తావించారు. అర్ధాంతరంగా ఆగిపోయిన పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని కోరారు. సంబంధిత అధికారులతో ప్రస్తావించినా పట్టించుకోవడం లేదన్నారు.

# మల్లయ్య కొండకు 37 బస్ సర్వీసులు

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండ మహాశివరాత్రి ఉత్సవాలకు కొండ కింద నుండి కొండ పైకి 37 సప్తగిరి ఎక్స్ప్రెస్ బస్ సర్వీసులు నడుపుతున్నట్లు మదనపల్లి వన్ డిపో మేనేజర్ రమణారెడ్డి విలేకరులకు తెలిపారు. 15వ తేదీన శ్రీ శక్తి యధావిధిగా కొనసాగుతుందని మదనపల్లి నుండి తంబళ్లపల్లె కొండ కిందికి 20 సర్వీసులు, తంబళ్లపల్లె బస్టాండు నుండి కొండ కిందికి ఆరు సర్వీసులు, బీ కొత్తకోట నుండి 3 సర్వీసులు, ములకలచెరువు నుండి రెండు సర్వీసులు,పెద్ద మండలం నుండి తంబళ్లపల్లెకు మూడు సర్వీసులు తిరుగుతాయన్నారు. శ్రీ శక్తి మహిళల ఉచిత ప్రయాణం కొనసాగుతుందని ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసులకు సహకరించాలని ఓ ప్రకటనలో కోరారు. ఆయన వెంట ఆర్టీసీ సిబ్బంది బాబ్జి తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

**ముద్దనూరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ;**



పట్టణంలో స్టేట్ బ్యాంకు సమీపాన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు అయినా ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాలుగు రోడ్ల కూడలి నుండి పాత బస్టాండ్ వైపు స్కూటీ లో మునికుమార్ అనే అతను వస్తుండగా, ఎదురుగ వస్తున్నా పల్సర్ బైక్ లో మరో యువకుడు ఢీకొనగా ఇరువురికి గాయాలు కాగా, వెంటనే స్థానికులు 108 కు సమాచారం ఇవ్వగా, హుటాహుటిన సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని గాయాలు అయినా మునికుమార్ ను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.మరో యువకుని స్థానిక ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

## మెడికల్ కాలేజీ మంజూరులో మంత్రి కృషి

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు నియోజకవర్గానికి 70 కోట్లతో యునాని మెడికల్ కళాశాల మంజూరులో మంత్రి సత్య కుమార్ కృషి అభినందనీయమని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి కొనియాడారు. సొంత గడ్డకు మేలు చేయాలన్న తలపుతో మంత్రి సత్య కుమార్ ప్రొద్దుటూరుకు యునాని మెడికల్ కళాశాల మంజూరు చేసిన సందర్భంగా స్థానిక శివాలయం కూడలిలో బిజెపి శ్రేణులు మిఠాయిలు పంచి బానసంచ పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి జయలక్ష్మి రూరల్ మండలం బిజెపి ప్రెసిడెంట్ మురళి రెడ్డి ఓ కన్వీనర్ గౌరీశంకర్ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్ నాయుడు స్టేట్ కౌన్సిల్ మెంబర్ గురు ప్రసాద్ రవిశంకర్ శరన్ మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు శక్తి కేంద్ర ప్రముఖులు పాల్గొన్నారు.

## వైష్ణవీమాతా ఆలయాల్లో అభిషేకాలు

**చౌడేపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

రాహుకాల సమయంలో శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ, పుదిపట్ల వైష్ణవీ మాతా ఆలయాల్లో విశేషాభిషేకాలు జరిగాయి. ఆయా ఆలయాల్లో ఉదయాన్నే అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అలంకరణగావించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ముడుపులు చెల్లించారు. రాహుకాల సమయంలో పూజలో పాల్గొనడం వల్ల కుటుంబాలు, లోకం సుభిక్షంగా వుంటుందని పండితులంటున్నారు. బోయకొండలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుదిపట్లలో ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. మదనపల్లి న్యాయమూర్తి శిరీష్ కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకొన్నారు.

## 108 ఉద్యోగుల ఆర్థిక పెంపుదలపై హర్షం

**చౌడేపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**




108ద్వారా సేవలందించే ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఆర్థిక పెంపుదలపై హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు గణేష్, ప్రసాద్‌లు ప్రసంగిస్తూ 108వాహనం లో ఇఎంటీ, పైలెట్‌లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జీతాన్ని రూ. 2వేల వరకు పెంచారన్నారు. అదే విధంగా 5నుంచి 10సంవత్సరాలు పూర్తయిన వారికి ఆటోమేటిక్ స్లాబ్ అప్రేడేషన్ చేయాలని నిర్ణయించడం ద్వారా మరింత వెలుసుబాటు కల్పించారన్నారు. ఈమేరకు ఏపీ 108సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. మరింత మెరుగైన సేవలందించి భవ్యకంపెనీ, ప్రభుత్వానికి మంచి పేరు తెస్తామన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

**రామసముద్రం పిబ్రవరి 13 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒక్కటైన ఆర్ నడిం పల్లె గ్రామ పంచాయతీ బల్ల సముద్రం వద్ద కొండ పై కొలువైన శ్రీ వాళీశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్స వాలకు సిద్ధమోతున్నది గురువారం ఆలయంలో అంకురార్పణ వేద మంత్రాలతో ఆలయ అర్చకులు లోఖనాధం దీక్షితులు అర్చకబృందం ఘనంగా నిర్వహించారు. ఈనెల 12 నుంచి 17వరకు 8రోజులు పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్న శివరాత్రి ఉత్స వాలకు ఆలయ ప్రాంగాణం పండుగ వాతావరణంతో కళకళలాడుతున్నది.భక్తులు కొలిచే వారికి కొంగుబంగారమై,కష్టాలు తొలగించే స్వామిగా వాళీశ్వర స్వామి ఖ్యాతి గడించారు. మండల కేంద్రానికి 10 కిలోమీటర్లు దూరంలో వాళీశ్వర స్వామి కొండలో వెలిసిన ఈ క్షేత్రం పచ్చని చెట్లు, ఈ కొండలో విశిష్టత ఏమిటంటే సంవత్స రానికి ఒక సారి పూచే జాలారీ పూలు మధ్య ప్రకృతి ఒడిలో ఒదిగినట్లు దర్శనమిస్తుంది,ప్రతి సోమవారం స్వామి వారికి అమ్మవారికి అభిషేక,అర్చనలు జరుగుతాయి. బ్రహ్మోత్స వాలు దేవాదాయ శాఖ వారి పర్యవేక్షణలో, కార్యనిర్వాహన అధికారి,ఎస్సై, పోలీస్ సిబ్బంది ఆలయ ప్రధాన అర్చకులు లోఖనాధం దీక్షితులు ఆధ్వర్యంలో మొదటి రోజు అంకురార్పణ,ధ్వజారోహణం,స్వామి అమ్మ వార్లకు కళ్యాణం, రథోత్స వం,వసంతోత్స వం,పారువేట,స్వామి వారు తిరుగు ప్రయాణంతో ఉత్స వాలు ముగుస్తాయి.ఆలయానికి వచ్చే భక్తుల కోసం తాగు నీరు, వసతి, పారిశుద్యం, వాహనాలు పార్కింగ్, పోలీస్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు, ఉచిత వైద్య శిబిరం, తాత్కాలిక మరుగు దొడ్లు, దర్శనక్యూ లైన్లు,అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ అధి కారి విశ్వనాథ్, ఈ వో రమణ అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

**రామసముద్రం పిబ్రవరి 13 ప్రభాతవార్త**



మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్స వ వేడుకలు ప్రిన్సిపాల్ చిట్టి బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా ఎంఈవో హేమలత, మట్లవారిపల్లె హెచ్ ఎం వెంకటరణ నాయుడు, చెంబకూరు హెచ్ఎం రమేష్, బ్ల్యూమింగ్ రోజస్ కరస్పాండెంట్ శశికళ,బాలాజీ, వీరిని ఉపాధ్యాయులు విద్యార్థులు సాధరంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక వేయంతో చదివి మంచి ఉద్యోగాలతో స్థిరపడి తల్లి దండ్రులకు, విద్యనేర్పిన గురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. చెడు అలవాట్ల జోలికి వెళ్ళరాదన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్స వంలో ఎంఈవో హేమలత హెచ్ఎంలు వెంకటరమణ నాయుడు, రమేష్, శశికళ కళాశాల లెక్చరర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు

సిద్ధవటం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :



అపెక్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మ్యాక్స్ అండ్ సైన్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఐటీ నీట్ ఒలంపియాడ్ ఫలితాలలో జాతీయస్థాయిలో విజయం సాధించారని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటేష్ తెలియజేశారు. జనవరి 24వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో శ్రీ నలంద ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయం సాధించారు. అలాగే మండల విద్యాశాఖ అధికారిని అరుణ మాట్లాడుతూ రాబోవు రోజులలో మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు.

## రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ

సిద్ధవటం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :



మండలం పొన్నవోలు రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు బి.చంద్ర నాయక్ ఎరువుల పంపిణిని తనిఖీ చేయడం జరిగింది. అంతేకాకుండా రైతులకి అవసరానికి మించి ఎరువులు వాడొద్దని ,మట్టి నమూనా పరీక్షలు ఆధారంగా ఎరువులు సిఫారసు మేరకు వాడుకోవలెను తెలిపారు. అంతే కాకుండా రైతులకి పీఎం కిసాన్ డబ్బులు పడలంటే రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలుపడమైన, లేనిచో డబ్బులు జమ అవ్వడం జరగదు అని తెలుపడమైనది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాల పిజికల్ డైరెక్టర్ సన్మానం

సుండుపల్లె, పిబ్రవరి 13,ప్రభాతవార్త :



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేయుచున్న రాధా రాణిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాకిర బేగం ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరు సన్మానించడం జరిగిందని షాకీర బేగం తెలియజేసారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ రాధా రాణి పిల్లలకు చక్కగా ప్రాక్టీస్ చేయించి మన సుండుపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులను జాతీయ స్థాయిలో పాల్గొనేటట్టు చేయడం చాలా గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేత సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు వెడల్పుతో ఆనందం

సుండుపల్లి, పిబ్రవరి 13, ప్రభాతవార్త :



మండల కేంద్రంలో ఆర్ అండ్‌బి రోడ్డు ఆక్రమణకు గురై ఒక వాహనం వస్తే మరొక వాహనం వెళ్లే దానికి ఇబ్బందులు పడుతున్న సమయంలో మండల అధ్యక్షుడు చప్పిడి రమేష్ నాయుడు రాష్ట్ర కార్యదర్శి మహేష్ నాయుడు సొంత నిధులతో ప్రధాన మురికి కాలువ ఆక్రమణలు తొలగించడంతోపాటు కాలవలోని చెత్తాచెదారం రాళ్ల రప్పలు ట్రాక్టర్లలో తరలించారు. దీంతో 20 అడుగులు కూడా లేని రోడ్డు దాదాపు 40 అడుగులు ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఒకపక్క పూర్తిస్థాయిలో కాలువ వరకు అడ్డంకులు లేకుండా చూడాలని అలాగే మరోవైపు ఉన్న అంగళ్ళ ముందర ఆక్రమణ తొలగించి పుణ్యం కట్టుకోవాలని కోరుతున్నారు.

## ప్రశాంతంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త.



రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుల ఎంపిక కోసం శుక్రవారం మదనపల్లెలో నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మొత్తం 274 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉండగా, అందులో 260 మంది ఓటు వేశారు. పోలింగ్ సమయం ముగిసిన అనంతరం ఓట్లతో కూడిన బ్యాలెట్ బాక్సులను విజయవాడకు తరలించారు. ఈ ఎన్నికల నిర్వహణ అధికారులుగా సీనియర్ బార్ అసోసియేషన్ సభ్యులు అమర్నాథ్‌రెడ్డి, న్యాయవాదులు విజయ్‌కుమార్‌రెడ్డి వ్యవహరించారు. వారికి సహాయకులుగా ఇతర న్యాయవాదులు, సెక్రటరీ మనోహర్, వివిధ అభ్యర్థుల తరపు ఏజెంట్లు సమన్వయంతో పనిచేశారు. మొత్తం 23 మంది సభ్యులను ఎన్నుకునేందుకు రాష్ట్రవ్యాప్త న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. సహకరించిన అధికారులకు, ఏజెంట్లకు ధన్యవాదాలు తెలిపారు.

## కలెక్టరేట్ వద్ద ఎస్.టి.యు సమరభేరి

### హామీల అమలు కోసం పెల్లుబికిన ఉపాధ్యాయ లోకం

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త.



పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు, భత్యాల చెల్లింపులో ప్రభుత్వం తాత్సారం చేయడంపై ఎస్.టి.యు నేతలు కలెక్టరేట్ వద్ద సమరభేరి మోగించారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు రెండవ దశ పోరాటంలో భాగంగా శుక్రవారం మదనపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్టియు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు భారీ ధర్నా నిర్వహించారు. వేలాదిమంది ఉపాధ్యాయులు పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఎస్ టి యు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అంకం శివారెడ్డి, పోకల మధుసూదన్‌ల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి, మధుసూదన్ లు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తయిన ఇప్పటివరకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్టియు ఆర్థిక కార్యదర్శి మోహన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు జగన్ మోహన్, కడియాల మురళి, బోడే మోహన్, ఆరవ వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు నరసింహులు, జనార్దన్ రెడ్డి, గిరిధర్ నాయక్, ఎస్టీయు నాయకులు భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి, ప్రభాకర్, రమణ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రాజారెడ్డి, గోపాల్, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, అరీవుల్ల, అయూబ్ ఖాన్, లింగమూర్తి, హరికిషోర్ రెడ్డి, గంగాధర్, కాశీనాథ్,సుబ్రహ్మణ్యం, శ్రీరాములు రెడ్డి, మంజునాథ్, అనీల్ కుమార్, మొగిలేశ్వ, మధుకర్ రెడ్డి, బుడ్డన్న, భాస్కర్, కిషోర్, మహిళా నాయకులు రమాదేవి, రజని, వసంత, అంజలి, దీపారాణి, షబీనా బేగం, గంగులమ్మ, రాణి, నాగరత్నమ్మ, కుసుమ, లక్ష్మి శాంతి, వాణి, ఉపాధ్యాయిణీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కలికిరి తహసీల్దార్ ఎస్.సాహిద్ అహ్మద్

కలికిరి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:



కలికిరి మండలం తహసీల్దార్‌గా ఎస్.సాహిద్ అహ్మద్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కలికిరి మండలం తహసీల్దారు విధులు నిర్వహిస్తున్న హరికుమార్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీచేశారు. ఆయన స్థానంలో కలికిరి మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.సాహిద్ అహ్మద్‌ను కలికిరి మండలం తహసీల్దారుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాహిద్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించే దిశగా పని చేస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త.

రోడ్డు ప్రమాదంలో ఓ రైతు గాయపడిన సంఘటన శుక్రవారం కురుబలకోట మండలంలో చోటుచేసుకుంది. బాధితులకు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంగళ్ల గ్రామం. తుమ్మచెట్లపల్లెకు చెందిన రైతు పి. విశ్వనాథ(48) ద్విచక్ర వాహనంలో సొంత పనుల నిమిత్తం అంగళ్లకు వెళ్ళాడు. అనంతరం తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గ మధ్యంలోని మిట్స్ కళాశాల వద్ద, ముందు వెళుతున్న ట్రాక్టర్ ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని స్థానికులు గమనించి చికిత్సల కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సలు చేసిన వైద్యులు రైతు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థులకు అభయ నిస్వార్థ ఉచిత శిక్షణ

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త.

ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పూర్తి చేసుకొని వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు అభయ నిస్వార్థ కేంద్రం ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనంతపురం కేంద్రంగా నిర్వహిస్తున్న అభయ నిస్వార్థ సంస్థ పేద విద్యార్థులకు 2 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీ పట్టణంలోని బాబు నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అర్హత పరీక్షను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు దరఖాస్తు సమయములో నమోదు చేసుకున్న సెల్‌ఫోన్‌తో పరీక్షకు హాజరు కావాలన్నారు. ఈ అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 60 రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో కూడిన ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎన్జీవో ఉపాధ్యక్షులకు ఘన సన్మానం

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ నిమ్మనపల్లి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్జీవో ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్‌కు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి గంగమ్మ జాతరలో భక్తులకు మూడు రోజులు పాటు మానవతా తరఫున మజ్జిగ తాగునీరు వాలంటీర్లుగా పనిచేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా మండల అధ్యక్షుడు మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి చైర్మన్ బాల సుబ్రహ్మణ్యం కార్యదర్శులు శివశంకర్ రెడ్డి, సహదేవరెడ్డి చైతన్యకుమార్‌రెడ్డి రవీంద్ర రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి ముంగడకే టమోటాలు

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



మార్కెట్ యందు టమోటాలు ఉన్నాయని తక్కువ ధరకే ప్రతి ఇంటికి ముంగటే టమాటాలు అందజేస్తామని మార్కెట్ యార్డ్ చైర్మన్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రతి ఒక్కరూ మార్కెట్ యార్డు నందు ఉన్న టమోటాలను సజీవన్ చేసుకోవచ్చన్నారు. తక్కువ ధరకే టమాటాలు అందజేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పవన్ రమణ బాదుల్లా ముక్తార్ బాలు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివకుమార్, అర్జున్ నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్స్ విశ్వనాథ్ నాయక్, లక్ష్మీరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యా వ్యవస్థ బలోపేతంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన"మన బడి మన భవిష్యత్తు" కార్యక్రమంలో ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు రమణప్ప నాయకులు కాశీ వర ప్రసాద్, నరహరి, భాస్కర్, అయాజ్ అహ్మద్, జి.నాగరాజు, ప్రతాప్ నాయక్, జి.రెడ్డెప్ప, హరిబాబు, జయరాం,ఎ.రెడ్డెప్ప, ఫాతిమా, శివ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పురుషుల కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

కడప ఫిబ్రవరి 13 ప్రభాతవార్త.



ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఒకరోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహణ జంతు శాస్త్ర విభాగం వారి ఆధ్వర్యంలో డిబిటి స్టార్ స్కీమ్‌లో నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రవికుమార్ తెలియజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బయోటెక్నాలజీలోని అడ్వాన్స్మెంట్‌ని తెలుసుకోవడం ద్వారా వారి భవిష్యత్తులో మంచి పరిశోధన వైపు అడుగులు వేయడానికి ఉపయోగపడతాయన్నారు. అలాగే యోగివేమన యూనివర్సిటీ నుండి చంద్రశేఖర్ మాట్లాడుతూ బయోడీజిల్, బయోహైడ్రోజెన్, బయో ఇతనోల్ ఉత్పత్తిలో ఆల్గే మరియు చేపల వ్యర్థాలు సహజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా ఏవిధంగా ఉపయోగపడతాయి అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి రవి శేఖర్ డిబిటీ స్టార్ కోఆర్డినేటర్ డాక్టర్ వై సావిత్రి, నాగేంద్ర కుమార్, నవనీశ్వర్ రెడ్డి, ప్రభుత్వ మహిళా కళాశాల పులివెందుల నుండి శ్రీనీత మైదుకూరు కళాశాల నుండి నరసింహారావు కృష్ణారెడ్డి రాజంపేట కళాశాల నుండి చంద్రమోహన్, రిజ్వానా వివిధ కళాశాలల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రికెట్ కిట్ పంపిణీ

కలికిరి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:




ఇందిరమ్మ కాలనీలో జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు జానం సుజాత కలికిరి ప్రభుత్వ బాలికల వసతి గృహం లోని విద్యార్థులకు తన సొంత నిధులతో క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆమె క్రికెట్ కిట్‌ను వసతి గృహానికి అందించారు. అదే విధంగా రాబోయే పరీక్షలను దృష్టిలో ఉంచుకొని పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు వంటి అవసరమైన విద్యాసామగ్రి పంపిణీ కూడా చేశారు. అనంతరం హరి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేసిన జానం సుజాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వాచ్‌మెన్ తులసీరాం, కుక్ మునిలక్ష్మి, కామాటి గౌరీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పూల చాందర్ సమర్పించిన హరితమ్మ

చిన్నమండెం పిబ్రవరి 13 ప్రబాతవార్త:



మండల కేంద్రంలో హజరత్ షా ఆలీ ఘంజే షహీద్ బాబా రహమతుల్లా ఇలాహి దర్గా ఉరుసు కార్యక్రమం సందర్భంగా గురువారం రాత్రి మంత్రి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరితమ్మ దర్గాలో పూలచ్చదర్ సమర్పించి మొక్కుకున్నారు. అనంతరం కడప అమీన్ పీర్ దర్గా గురు ఖ్వాజ సైద్ షా అరిఫుల్లా హుస్సేని హరితమ్మ కలసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గున్నారు.

## ఫ్రైడే డ్రైడే పాటిస్తే డెంగీ, మలేరియా జ్వరాలు రావు

### - డిప్యూటీ హెచ్‌ఈవో మహమ్మద్ రఫీ

కలికిరి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:



ఫ్రైడే డ్రైడేగా పాటించడం వల్ల దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్గున్యా, మెదడువాపు జ్వరాలను నియమింత్రణ చేయవచ్చని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కె.మాదిగపల్లి గ్రామంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు మరియు శుక్రవారం పొడి దినంగా పాటించడం వల్ల కలుగు ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహ్మద్ రఫీ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి ప్రమాదం. ఇటీవల ప్రభుత్వం మలేరియా వ్యాధిని నోటిఫైయబల్ డిసీస్‌గా గుర్తించి తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం, కనుగుడ్లు పక్కకు తిప్పలేకపోవడం, శరీరంపై దద్దులు, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఈ జ్వరాలలో కనిపిస్తాయన్నారు. వ్యాధిలక్షణాలను బట్టి రక్త పరీక్షలు చేయించుకొని సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదన్నారు. గ్రామంలో ఇంటింటి లార్వా సర్వే పరిశీలించి అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. పరిసరాల పరిశుభ్రత, చేతఉల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏఎన్ఎం నఫీసా, ఎంఎల్‌హెచ్‌పీ నాగవేణి, ఆశా కార్యకర్తలు, యల్లమ్మ, లక్ష్మీదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ.

తొండూరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



గ్రామంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఘన మద్దిలేటి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేయడం జరిగింది. వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రైవర్లు తమ యొక్క నిబద్ధతతో జాగ్రత్తగా వాహనాల నడపాలని లేనిపక్షంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని వారికి అవసరమైన లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలని అలాగే వాహనాలకు ఇన్సూరెన్స్ టాక్స్ పేపర్లు వాహనాల్లో ఉంచుకొని అడిగినప్పుడు చూపించాలని కాలం చెల్లిన వెంటనే వాటిని రెన్యువల్ చేసుకుంటూ ఉండాలని తెలిపారు. టూ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా వారి బండి యొక్క ఆర్ సి, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎవరైనా మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగినచో వారిపై చట్టబద్ధంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రేపటి నుంచి మల్లికార్జున స్వామి ఉత్సవాలు

నందలూరు, ఫిబ్రవరి 13: ప్రభాతవార్త:

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ నారాయణ రాజుపేట గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కమ్మర సర్వేశ్వర ఆచారి స్వామి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ పంచామృత అభిషేకం, మంత్రపుష్పం, బిల్వార్చన, మంగళహారతి, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు స్వయంగా స్వామివారికి అభిషేకం చేసే అవకాశమూ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

నందలూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



పాటూరు గ్రామ పంచాయతీ పరిధిలో వైకే పల్లి నుంచి నాగిరెడ్డిపల్లె వరకు దాదాపు రూ. 40 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను రాజంపేట జనసేన పార్టీ నాయకులు, మాజీ జడ్పిటిసి సభ్యులు యల్లటూరు శివరామరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ పనులను రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. నాగిరెడ్డిపల్లి, పాటూరు పంచాయతీల అభివృద్ధి కోసం మొత్తం కోటి రూపాయలకుపైగా నిధులు మంజూరు చేయడం వల్ల ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణంతో రైతులు, గ్రామస్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు షబ్బీర్ అహ్మద్, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్ యల్లటూరు వినోద్ కుమార్ రాజు, యల్లటూరు సుబ్బరాజు, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నియంత్రణ అందరి భాధ్యత

బద్వేల్ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



దోమల నియంత్రణ ప్రజల అందరి భాధ్యత అని, ప్రతి ఒక్కరు దోమతెరలు వాడటం శ్రేయస్కరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నరసింహారెడ్డి అన్నారు. బద్వేల్ మండలంలో, కొత్తచెరువు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది ఇల్లులు తిరిగి బానలు, ఫ్రిజ్జులు, డ్రమ్ములు, టైర్లను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలని సూచించారు. కాచి వడగట్టిన నీటిని త్రాగాలని సూచించారు. ఈ సందర్భంగా నరసింహ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి వెంగయ్యలు మాట్లాడుతూ, దోమల వలన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ,చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులు వస్తాయన్నారు. ఏ జబ్బులు వచ్చిన భయపడవలసిన అవసరం లేదన్నారు. నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారన్నారు. 104, విలేజ్ హెల్త్ క్లినిక్ లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో ప్రతి ఒక్కరూ వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్ధన్ రావు, సిహెచ్ఓ వీణ, ఏఎన్ఎం దీపిక, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థిని రక్త పరీక్షలు

బద్వేల్ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని సురేంద్రనగర్ వార్డు సచివాలయం పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాల బద్వేల్ నందు మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సెంట్ జాన్స్ మెడికల్ కాలేజ్ మరియు హాస్పిటల్ బెంగళూరు ఆధ్వర్యంలో 14 నుంచి 45 సంవత్సరాలు వారికి రక్త పరీక్షలు చేయడమైనది ఈ కార్యక్రమం నందు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై. శ్రీనివాసులు మాట్లాడుతూ 14వయస్సు నుండి 45 సంవత్సరాల బాలికలకు, స్త్రీలకు ఉచితంగా ఇమోపిలియా, స్కిసెల్ అనిమయి పై రక్తకణాలు అకృతిమొ రక్తపరీక్షలు బెంగుళూరు సెంట్ ఝాన్ సన్ వారి ఆధ్వర్యంలో ఉచితగా చేయబడును అన్ని తెలియ జేయడామైంది, ఈ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై శ్రీనివాసులు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ బి. వెంగయ్యహెల్త్ అసిస్టెంట్ వి. జనార్ధన రావు పాఠశాల ఇంచార్జి ఏ. రామయ్య టీచర్స్ మరియు మెడికల్ కాలేజ్ నుంచి వచ్చిన వైద్య సిబ్బంది ఏఎన్ఎంసి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బార్అండ్ రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలి

### ఎక్సైజ్‌శాఖామంత్రికి బివైఎస్ వినతి

మదనపల్లె, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :



మదనపల్లెలో ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బార్అండ్ రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునిత్ ఎక్సైజ్‌శాఖామంత్రి కొల్లు రవీంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బివైఎస్ అధ్యక్షులు మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసి బస్టాండు సమీపంలోని బార్ అండ్ రెస్టారెంట్‌తో పాటు పట్టణంలోని మరికొన్ని మద్యం దుకాణాలు 24గంటలు నిర్వహిస్తూ పలువురిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆ బార్ సమీపంలో పలు విద్యాసంస్థలు, ఆసుపత్రులు ఉండడం వల్ల అనేక మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ బార్‌పై పలుమార్లు ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. పెండింగ్‌లోని మెడికల్ కళాశాలను తక్షణం నడపాలని కోరారు.

## ఉద్యానపంటలపై రైతులు దృష్టి సారించాలి

### జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుభాషిణి

మదనపల్లె, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :



జిల్లా ఉద్యానశాఖ అధికారిణి

రైతులకు ఆదాయనిచ్చే ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారిణి ఎస్ ఎస్ వి. సుభాషిణి తెలిపారు. శుక్రవారం డివిజన్ స్థాయిలో మదనపల్లె, వాల్మీకిపురం, మొలకలచెరువు, తంబళ్లపల్లె, పుంగనూరు, చౌడేపల్లి ఉద్యానఅధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026-27లో రాయలసీమ, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టు కార్యాచరణ ప్రణాళికపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతిరైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న ఉద్యాన పంటల విస్తీర్ణానికి అధనంగా తక్కువ ఆదాయన్నిచ్చే సాంప్రదాయ వ్యవసాయ పంటల నుంచి అధిక ఆదాయం వచ్చే ఉద్యానపంటలు మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, దానిమ్మ, పూలు, అరటి,బొప్పాయి, కొబ్బరి కూరగాయల పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యానపంటల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, సంతోషి, వరప్రసాద్, బీమేష్, వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులు పాల్గొన్నారు.

## 17న ఛలో విజయవాడ జయప్రదం చేయండి

ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 మాసాలు పూర్తవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లవుతున్నా, పిఆర్సీ అమలుకు ప్రయత్నించకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 17వ తేదీ చేపట్టబోయే ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహమ్మద్, డి.సుబ్బారావు, ఎ.డి.దేవ దత్తం, కె.సుధాకర్, పి.వెంకటసుబ్బయ్య, కడప నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హిఫాజితుల్లా, కరీముల్లా, ట్రెజరర్ మేరీ ప్రసన్న, కడప మండల ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఎస్ఎంఈ వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త.



ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ ఆర్ఏఎంపి పథకం కింద సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ నిర్వహిస్తున్న రెండు రోజుల వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం మదనపల్లె శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అన్నమయ్య జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కృష్ణ కిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని పారిశ్రామిక వనరులు, ప్రభుత్వ పాలసీలు, యంత్రసామగ్రిపై లభిస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. ఎంఎస్ఎంఈ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈ పథకం ద్వారా సంస్థల పోటీతత్వాన్ని పెంపొందించడం, మార్కెట్ లింకేజీలను బలోపేతం చేయడం, ఆర్థిక వనరులను సులభతరం చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు 152 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో హ్యాండీక్రాఫ్ట్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్పవన్ కుమార్ రెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ కమలానాథుడు, సీనియర్ కన్సల్టెంట్ శ్రీధర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి అద్దాలు పంపిణీ

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:



మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కస్తూర్బా ప్రభుత్వ బాలికల మరియు జడ్పీ స్కూలు విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ జిల్లా నోడల్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రవికుమార్ మరియు మండల వైద్యాధికారి డా.జేవీఆర్ ప్రసాద్‌లు విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలు ఎక్కువ సేపు చూడడం వల్ల కలిగే నష్టాలు గురించి తెలిపారు. అలాగే డిప్యూటీ హెచ్‌ఈవో శ్రీదేవి మాట్లాడుతూ దృష్టిలోపం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ కొరకు తీసుకునే ఆహార పదార్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జంట హత్యల కారకులను కఠినంగా శిక్షించాలి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:

బి.మఠం మండలం మూడుమల్ల గ్రామంలో జరిగిన జంట హత్యల వెనక ఎంతటి వారున్నా కఠినంగా శిక్షించాలని నరసింహ మాదిగ పేర్కొన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం పెండ్లిమర్రి మండలంలో విలేకరుల సమావేశంలో నరసింహ మాట్లాడారు. ఈ నెల 4న జరిగిన జంట హత్యల వెనక ఎపోలీసు వ్యవస్థ పూర్తిస్థాయిలో విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. మాదిగ జాతి బిడ్డలు అయిన ఆ ఇద్దరు అతి చిన్న వయసులో హత్య చేయబడడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ దుర్మార్గం వెనక ఎంతటి వ్యక్తి ఉన్నా పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని పోలీసులను కోరారు. బ్రహ్మంగారిమఠంలో ఎస్సై పూర్తి స్థాయిలో విచారణ చేసి ఉంటే ఇంత సమస్య ఉండేది కాదని మాకు ఉన్న అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు. మైదుకూరు డీఎస్పీ పూర్తి సమర్థవంతంగా న్యాయబద్ధంగా విచారణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీరం గోపాల్, పెండ్లిమర్రి మండల నాయకులు గంగులయ్య, చిన్న గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.



## మాలే పెద్దయ్య స్వామి 16న తిరునాళ




**చిన్నమండెం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:**
మండలంలోని దేవగుడిపల్లి గ్రామం కురవపల్లి సమీపంలో చింతోళ్ల మాలే లో వెలసిన పెద్దయ్య స్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు.ఇక్కడ ఈశ్వరున్ని పెద్దయ్య స్వామిగా పూజిస్తారు. దేవరెడ్డు ను ఇలవేల్పు గా చేసుకొని ప్రతి ఏడాది శివరాత్రి ఉత్సవాలు ప్రారంభించి 3 రోజుల పాటు మాలే జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మరుసటి రోజు 16 వ తేదీ సోమవారం ఉదయం 4 గంటలకు దేవరెడ్డును సాముస్కృతిక కార్యక్రమాల మధ్య మాలేకు తీసుకెళతారు. ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా గ్రామంలో బంధు మిత్రులతో సందడి నెలకొంటుంది. 16 వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుండి మాలే జాతరలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మరియు కుటుంబ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమం చేయనున్నారు. కావున భక్తులు ప్రజలు నాయకులు ఈ కార్యక్రమంలో వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# జాతర రోజున భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి

**లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**
గంగమ్మ జాతర రోజున అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి భక్తులకు మెరుగైన సేవలు సౌకర్యాలు అందించాలని ఆర్డీవో శ్రీనివాసులు మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం గంగమ్మ జాతర ప్రాంగణంలోని ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా 10,100,300 ప్రత్యేక క్యూ లైన్‌లను వారు పరిశీలించారు. విఐపి ల దర్శనం ప్రత్యేకంగా లేకుండా 300 రూపాయలు క్యూలైన్‌లో పంపేటట్లు ఏర్పాటు చేశామని దేవాదాయ శాఖ వారు తెలిపారు. అంతేకాకుండా స్త్రీలకు ప్రత్యేక స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతర ప్రాంగణం చుట్టూ విద్యుత్తు తీగలు కిందికి లేకుండా సక్రమైన పద్ధతులు పెట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. క్యూలైన్‌లలో భక్తులకు ఇబ్బందులు పడకుండా సెలవు పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. చిట్లూరు రవీంద్ర నగర్ లక్కిరెడ్డిపల్లి మూడు ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే ఆర్టీసీ బస్సులకు నాలుగు ప్రత్యేక పార్కింగ్లో ఏర్పాటు చేశామని ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు విద్యుత్ శాఖ అధికారులు మూడు రోజులు అందుబాటులో ఉండి జాతరకొచ్చే భక్తులకు చాందిని బండ్లు ఏర్పాటు చేసే వారికి విద్యుత్తు వైర్లు తగలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులే కాకుండా దేవాలయ శాఖ తరపు నుంచి 100 మంది పైగా ప్రత్యేక అధికారులను స్థానిక రెవిన్యూ మండల పరిషత్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. చాతర



ప్రాంగణంలో ఎలాంటి చెత్తాచెదారం శానిటేషన్ సంబంధించిన పనులు చేయడానికి రాయచోటి మునిసిపాలిటీ వేంపల్లి పులివెందుల కార్మికులను అందుబాటులో పెడుతున్నట్లు ఈవో తెలియజేశారు. ఏది ఏమైనా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతి కుమార్ ఎంపీడీవో రెడ్డయ్య ఏపీ ఎస్పీడీఎల్ ఏఈ హరినాథ్ ఆర్డబ్ల్యూ ఎస్ఈఈ కిషోర్ మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ ఆలయ కమిటీ చైర్మన్ సోడి వెంకటేశ్వర్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ డి.ఎస్.పి కృష్ణమోహన్ సీఐ నరసింహారాజు నాయక్ ఎస్ఐ శోభా, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో సమృద్ధిగా యూరియా

**జిల్లా వ్యవసాయఅధికారి శివనారాయణ**

**మదనపల్లె, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :**



జిల్లాలో 2025-26 సీజన్‌కు సంబంధించి అన్ని పంటలకు అవసరమైన యూరియా సంవృద్ధిగా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని పంటలకు అవసరమైన 18071మెట్రిక్ టన్నుల యూరియా ఎరువు పంపిణీకి ప్రణాళిక చేయబడిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎటువంటి ఎరువుల కొరత లేదన్నారు. దేశీయంగా ఉన్న అన్ని ఎరువులు ఖర్మాగారాలు ఉత్పత్తి చేయుచున్నదని, అదే విధంగా విదేశాల నుంచి కూడా అవసరమైన యూరియా దిగుమతులు ఉన్నాయన్నారు. రాబోయే పంట కాలంలో కూడా యూరియాకు ఎటువంటి కొరత లేదన్నారు. నూతనంగా రూపొందించబడిన సాంకేతిక అభివృద్ధి పరిచిన నానో యూరియా, నానో డిఏపి ఎరువులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. సాంప్రదాయ ఎరువులకు 100శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సహిస్తున్నాయన్నారు. రైతు సోదరులు ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ముద్రించిన ఎంఆర్‌పి ధరలను చూసుకొని దాని ప్రకారమే చెల్లించి డీలర్ నుంచి రశీదు పొందాలన్నారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఉత్సవాలు విజయవంతం చేయాలి

**సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి.**



**తంబళ్లపల్లె ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :**
తంబళ్లపల్లె కు సమీపంలోని మల్లయ్య కొండ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె మల్లయ్య కొండ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష అనంతరం మల్లయ్య కొండలో డి.ఎస్.పి మహేంద్ర తో కలిసి పర్యటించారు. కొండకు వచ్చే వేలాది మంది భక్తులకు తాగునీరుతో పాటు ఎప్పటికప్పుడు పారిశుద్ధం, నిరంతర విద్యుత్తు, మరుగుదొడ్లు ఏర్పాట్లు,మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు, క్యూ లైన్ల భారీ కేడ్లు ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల రద్దీ విషయంలో పోలీసులు, వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. భక్తులకు అత్యవసర చికిత్సల కోసం ఉచిత వైద్య శిబిరంతో పాటు అత్యవసర అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు, ఫారెస్ట్ అధికారులు కొండపై ధూమపానం, మద్యపానం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కొండ కింద అన్నదాన శిబిరాన్ని పరిశీలించి కమిటీ సభ్యులను ప్రశంసించారు. కొండకు వెళ్లే రవాణా బస్సుల వివరాలను అడిగి తెలుసుకుని ప్రయాణికుల రద్దీ, ట్రాఫిక్ సమస్య,భద్రత పై ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట ఆర్టీసీ డిపో మేనేజర్ రమణారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, తాసిల్దార్ శ్రీనివాసులు, ఎస్సై అనిల్ కుమార్, ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, టిడిపి రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, ఈఓ ముని రాజా, కొండకిట్ట, ఏఈ సురేంద్ర, వినోద్ కుమార్, రమణ, మండల స్థాయి అధికారులు, అన్నదాన కమిటీ సభ్యులు,టిడిపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అన్ని రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తుంది

**మైదుకూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు పిఎం ఉష ప్రోగ్రాంలో భాగంగా మహిళా విద్యార్థుల కోసం నిర్వహించిన జెన్ ఏఐ టూల్స్ ప్రాంప్ట్ ఇంజనీరింగ్ కోర్సు ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఎక్సెల్ ప్రైవేట్ లిమిటెడ్ నిపుణుడు సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం విజయవంతంగా సాగింది. కార్యక్రమంలో నారాయణ రెడ్డి మాట్లాడుతూ,జెనరేటివ్ ఏఐ మరియు ప్రాంప్ట్ ఇంజనీరింగ్ కోర్సుల ప్రాముఖ్యతను తెలుపుతూ వేగంగా మారుతున్న డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరు ఏఐపై అవగాహన పెంపొందించుకోవడం అత్యవసరమన్నారు. ముఖ్యంగా మహిళా విద్యార్థులకు ఈ కోర్సును అందించడం శుభపరిణామమని అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన కాలేజీ కమిషనరేట్ వారికి మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేంపల్లి ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర కు కృతజ్ఞతలు తెలిపారు. కోర్సును సమగ్రంగా రూపొందించి, సరళంగా బోధించిన సుభాష్ చంద్రబోస్,లక్ష్మణ్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులు కోర్సులో నేర్చుకున్న జెన్ ఏఐ టూల్స్ మరియు ప్రాంప్ట్ ఇంజనీరింగ్ నైపుణ్యాలను రోజువారీ జీవితంలో, భవిష్యత్ ఉపాధి రంగాల్లో వినియోగించు కోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాలలో వేగంగా విస్తరిస్తోందని, దానిని నేర్చుకుని సమర్థంగా వినియోగించే వారికే ఉన్నత అవకాశాలు లభిస్తాయని తెలిపా



రు. ఈ అరుదైన కార్యక్రమాన్ని నిర్వహించిన కమిషనర్ ఆఫ్ కాలెజియేట్ ఎడ్యుకేషన్ వారికి అభినందనలు తెలియజేశారు.తదనంతరం ఈ ప్రోగ్రాంలో పాల్గొన్న మహిళా విద్యార్థినులకు మరియు అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సర్టిఫికెట్ అందుకున్న అధ్యాపకులలో డాక్టర్ పి. వి. కృష్ణారెడ్డి, డాక్టర్ సుధీర్ రెడ్డి, సుభాన్ సాహెబ్ మరియు పి. చిన్న రాయుడు ఉన్నారు.ఈ కార్యక్రమం మహిళా సాధికారతకు, ఆధునిక సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి ఒక ప్రేరణాత్మక మైలురాయిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్, కోఆర్డినేటర్ డాక్టర్ నవనీశ్వర్ రెడ్డి,ప్రిన్సిపల్ వేంపల్లి ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా ముగిసిన స్టేట్‌బార్ కౌన్సిల్ ఎన్నికలు

**బద్వేలు లీగల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:**



రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్వహించుచున్న ఎన్నికలలో భాగంగా కడప జిల్లా బద్వేలు న్యాయస్థాన ప్రాంగణంలో ఈ ఉదయం అనగా 13 వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు బద్వేలు పోలింగు అధికారి ఆర్.ఆర్. వర్మ ఆధ్వర్యంలో సి.సి.కెమెరాల పర్యవేక్షణలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య హోరా హోరీగా సాయంత్రము 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహింపబడ్డాయి. ఈ సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకునే అర్హుడైన ప్రతి ఒక్క న్యాయవాది గుర్తింపు కార్డులను పరిశీలించిన మీదటే వారివారి ఓటు హక్కును వినియోగించుకొనుటకు అనుమతించడం జరిగిందని, బద్వేలు బార్ అసోసియేషన్ మొత్తము న్యాయవాద ఓటర్లు 69 మందికి గాను 68 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని ఈ ఎన్నికల ప్రక్రియ సజావుగా ప్రశాంతముగా కట్టుదిట్టముగా జరుగుటకు సహకరించిన ప్రతి ఒక్క న్యాయవాదికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపుకుంటూ ఈ ఎన్నికల ప్రక్రియను జయప్రదం చేసినట్లు పోలింగు అధికారి ఆర్.ఆర్.వర్మ ఓ ప్రకటనలో తెలిపారు.

## లయోలా డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ జోజిరెడ్డి

**పులివెందుల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**
పులివెందుల పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) సహకారంతో శుక్రవారం నిర్వహించి న ఉద్యోగ మేళా విజయవంతంగా జరిగింది. విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయాలనే ఉద్దేశంతో కళాశాలలో క్వాంటం సాంకేతిక విజ్ఞానం, దత్తాంశ శాస్త్రం, జీవసాంకే తిక శాస్త్రం వంటి ఆధునిక రంగాల్లో శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో మొత్తం 13 ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. పాల్గొన్న సంస్థల్లో గ్రీన్ టెక్, టాటా ఎలక్ట్రానిక్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, క్వెస్ కార్ప్, ష్నైడర్ ఎలక్ట్రిక్, ఎలాస్టిక్‌రన్, డోనో బీపీవో ఐటీ సొల్యూషన్స్, ఆదిత్య బిర్లా గ్రూప్, జోయాలుక్కాస్, యంగ్ ఇండియా తదితర సంస్థలు ఉన్నాయి. మొత్తం 153 మంది అభ్యర్థులు హాజరుకాగా, అందులో 112 మంది వివిధ సంస్థల్లో ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రెవ్. ఫా. ఎల్. జోజి రెడ్డి అభినందిస్తూ, విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిపై మరింత దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగ మేళా కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయ వంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపాల్ వానా చిన్నప్ప, ఏపీఎస్ఎస్ డీసీ నియామక అధికారి శ్రీనివాస్ రెడ్డి, అంతర్గత నాణ్యత భరోసా సమితి సమన్వయకర్త ఎం.రమణరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండండి

**చాపాడు. ఫిబ్రవరి 13.ప్రభాతవార్త :**




సైబర్ నేరాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకుల ప్రతినిధులు ఎల్ డి ఎం జనార్ధన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ అధికారి లక్ష్మీతులసి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కళ్యాణ మండపంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె.వి రమణ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సురక్షితమైన డీజిల్ బ్యాంకింగ్ కొరకు మంచి అలవాట్లు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఈ దేశంలో ప్రతినిత్యం ఎన్నో సైబర్ క్రైమ్ జరుగుతున్నాయని, వాటిపట్ల అవగాహన కలిగివుండాలనిసూచించారు. ఆర్థిక చైతన్యాన్ని కలిగించాలనే గుర్తింపు కార్డులు ఇవ్వరాదన్నారు. ప్రతి ఖాతాదారునికి నామినీ తప్పినసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రేడియేషన్ చికిత్సలో " ఎమ్ఆర్ లినాక్" మిషన్ ఆధునిక యుగానికి నాంది

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**
క్యాన్సర్ రోగులకు రేడియేషన్ చికిత్సలో ఎంఆర్ లినాక్ మిషన్ ఆధునికతకు నాంది పలుకుతుందని హైటెక్ సిటీ యశోదా హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్టు మరియు క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత తెలిపారు. శుక్రవారం స్థానిక కొవ్వూరు గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేడియేషన్ చికిత్సలో ఎంఆర్ లినాక్ మిషన్ పనిచేసే తీరును ఆమె వివరించారు. సాధారణంగా రేడియేషన్ థెరపీ తీసుకునే రోగులకు చాలా టెన్షన్ ఉంటుందని రేడియేషన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయా?', 'భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు వస్తాయా?' అనే ప్రశ్నలు చాలా సాధారణంగా రావడం సహజమన్నారు. అలాంటి భయాలను తగ్గించి, మరింత కచ్చితమైన మరియు సురక్షితమైన రేడియేషన్ చికిత్స అందించడానికి ఎంఆర్ లినాక్ అనే అత్యాధునిక టెక్నాలజీని యశోదా హాస్పిటల్స్ - హైటెక్ సిటీలో ప్రవేశపెట్టామని ఆమె వివరించారు. హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ లో ఉపయోగిస్తున్న ఎంఆర్ లినాక్ సేవల గురించి డాక్టర్ సునీత వివరిస్తూ..ఇది ప్రపంచంలోని అత్యాధునిక రేడియేషన్ యంత్రాలలో ఒకటి అని, ఇందులో రెండు సాంకేతిక పరిజ్ఞానాలు ఎంఆర్ఐ స్కాన్ మరియు లీనియర్ యాక్సిలేటర్‌లు ఒకే యంత్రంలో పనిచేస్తాయని, దీని ప్రత్యేకత ఏమిటంటే ప్రతి రోజూ చికిత్స ప్రారంభం కాకముందే రోగికి ఆటోమేటిక్‌గా ఎంఆర్ ఐ స్కాన్ జరుగుతుందని,దాంతో ఆ రోజు ట్యూమర్ యొక్క ఆకారం, సైజు, స్థానం వంటి వివరాలు స్పష్టంగా తెలుస్తాయని, దీని ఆధారంగా రేడియేషన్ కేవలం ట్యూమర్ ఉన్న ప్రాంతానికే ఇవ్వబడుతుందని, పక్కన ఉన్న ఆరోగ్యకరమైన అవయవాలపై ఎటువంటి ప్రభావం ఉండదని ఆమె వివరించారు. సాధారణ




రేడియేషన్ థెరపీలో పేషెంట్లకు తలనొప్పి, స్కిన్ ఇరిటేషన్, బలహీనత, వాంతులు, మూత్రంలో లేదా మోషన్‌లో రక్తం వంటి సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చునని, కాని ఎంఆర్ లినాక్ టెక్నాలజీతో ఇవన్నీ చాలా వరకు నివారించవచ్చునని, ఇది ప్రతి రోజూ శరీరంలోని మార్పులను గుర్తించి చికిత్సను ఆ మేరకు సర్దుబాటు చేసే సామర్థం కలిగిన యంత్రమని క్షుణ్ణంగా మీడియాకు వివరించారు. బ్రెయిన్ ట్యూమర్లలో ఎంఆర్ఐ గైడెన్స్ వల్ల ట్యూమర్ స్పష్టంగా కనిపించడంతో, రేడియేషన్‌ను మిల్లీమీటర్ స్థాయిలో ఇవ్వగలుగుతున్నామన్నారు. MR Linac అనేది రేడియేషన్ చికిత్సలో నిజమైన విప్లవాత్మక మార్పు అని ఇది రోగులకు అత్యధిక భద్రత, అత్యల్ప సైడ్ ఎఫెక్ట్స్ మరియు గరిష్ట కచ్చితత్వం అందించే సాంకేతిక అద్భుతమని వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ సునీతతో పాటు యశోద హాస్పిటల్ హైటెక్‌సిటీ టీమ్ లీడర్ హరి కిరణ్ పాల్గొన్నారు.

## పిల్లలను పాఠశాలలో చేర్పిద్దాం

**కురబలకోట ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**



ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించుదాం, ఊరిబడిని కాపాడుకుందాం అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని ఈరోజు కురబలకోట మండలంలోని మొలకవారిపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాల నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎన్ ద్వారకనాథ్, ఎంఈఓ 2 శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని తల్లితండ్రులు వద్దకు తీసుకుపోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని ఈ విషయాన్ని తల్లి తండ్రులు గమనించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మండల విద్యాశాఖ అధికారులు కార్యక్రమం పాఠశాల నుండి ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు రమణప్ప ,అధ్యక్షుడు ఆదినారాయణ ,ప్రధాన కార్యదర్శి షామీర్ భాష, సహాధ్యక్షులు బాలాజీ,ఆర్థి కార్యదర్శి చంద్ర శేఖర్ యుటిఎఫ్ జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ శివ శంకర్, జిల్లా కౌన్సిలర్లు రమణారెడ్డి, మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయులు రమేష్ నాయక్, సాంబశివ, రెడ్డి భాష,అబ్దుల్ సమద్, రామయ్య,ప్రభాకర్ రెడ్డి,శివ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముగిసిన పరికిదొన ఆవులపబ్బం



**పరికిదొన(చౌడేపల్లి), ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**
కాటమరాజుకు దీపారాధనలో మహిళలు...దూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులతో యువకుల కేరింతలు...బంధుగణంతో పెద్దల ముచ్చట్లు...ఈ విధంగా ఆవులపబ్బం ఆయా గ్రామాల్లో సంక్రాంతి సందడిని మోసుకొచ్చింది. మండలంలోని పడమర ప్రాంతాల్లో సంక్రాంతి పండుగను చేసుకోకుండా ఆవుల పబ్బాన్ని వైభవంగా జరుపుకొంటారు. ఈ క్రమంలో రెండు రోజులపాటు జరిగిన ఆవులపబ్బం శుక్రవారంతో ముగిసింది. చివరి రోజున గడ్డంవారిపల్లి, పరికిదొన, ఆమినిగుంట పంచాయితీకి చెందిన 12గ్రామాల రైతులచే ఏర్పాటు చేయబడ్డ చాందినీబండ్లు భక్తులను అలరించాయి. పరికిదొనకు కిలోమీటరు దూరంలోని అడవిలో గల కాటమరాజు ఆలయానికి చాందినీబండ్లతో వెళ్ళి మొక్కులు తీర్చుకొన్నారు.

## శ్రీ చైతన్య హైస్కూల్‌లో ముందస్తు వేడుకలు



**వేంపల్లె ఫిబ్రవరి 13 (ప్రభాత వార్త)**
స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో మహా శివరాత్రి పర్వదినానికి ముందుగా ముందస్తు వేడుకలు నిర్వహించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి భక్తి, శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో శ్రీ పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, జ్యోతి ప్రజ్వలనంతో (దీపం వెలిగించి) కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు భక్తి గీతాలు ఆలపించి, మహాశివరాత్రి ప్రాముఖ్యతను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శివుడు, పార్వతీ దేవి వేషధారణలో ఉన్న చిన్నారుల అభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి సంస్కారాలతో ముందుండాలి. భక్తి, వినయం (నమ్రత), కృషి ఉంటే జీవితంలో ఉన్నత స్థాయిలను చేరుకోవచ్చు" అన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు బి.చేతన్ రెడ్డి మరియు బి. చైతన్య రెడ్డి లు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని, విద్యతో పాటు విలువలు కూడా సమానంగా అవసరమన్నారు. పాఠశాల ప్రాంగణం మొత్తం శివ నామస్మరణతో నిండిపోయి, భక్తి వాతావరణం నెలకొంది.

## కార్గోసేవలు సద్వినియోగం చేసుకోవాలి

**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రోడ్డురవాణాసంస్థ ఆధ్వర్యంలో ప్రజల ఇంటి వద్దకు సేవలు అందిస్తున్న కార్గోను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోని, ఉపయోగించే విదంగా అందరికి తెలపాలని బద్వేలు డిపో మేనేజర్ నిరంజన్ తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ లోని కార్గో సర్వీస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అక్కడప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు,ఎంత సమయంలో డెలివరీ జరుగుతుంది, ఎంత సమయంలో పంపడం జరుగు తుంది. సిసికెమెరాలు అమర్చారు. పరిశుభ్రఎలా ఉందని అడిగి తెలుసుకున్నా రు.బద్వేలు డిపో పరిధిలో ఒ సూరి రాజు నడుపుతున్నకార్గోఅందిస్తున్న సేవలకు రెండో స్థానంలోబద్వేలు డిపో ఉందని,తొందరలో మొదటిస్థానంలో చేరుతామన్నారు. ఉదయం 6గంటల నుండి రాత్రి 9గంటల వరకు పనిచేస్తుందన్నారు. పోరుమామిళ్ల, కాశినాయన, బి.కోడూరు, కలసపాడు మండలాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బాలికలకు ఉత్తమ విద్యను అందించాలి

**సమగ్ర శిక్షా ఏపీసీ డాక్టర్ నున్నా అనురాధ**

**మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త.**
కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల ప్రిన్సిపాల్లు, మోడల్ స్కూళ్ల వార్డెన్లు విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వసతి గృహాల్లో వారికి తల్లిలా ప్రేమాభిమానాలు చూపాలని జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ నున్నా అనురాధ సూచించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ సహకారంతో అన్నమయ్య, కడప, సత్యసాయి, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన 75 మంది ప్రత్యేకాధికారులకు స్థానిక గ్రీన్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి డాక్టర్ అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ అణగారిన వర్గాల బాలికల అభివృద్ధిలో కేజీబీవీలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రత్యేకాధికారులు కేవలం నిర్వాహకులుగానే కాకుండా, విద్యార్థులకు మార్గదర్శకులుగా, రక్షకులుగా వ్యవహరించాలన్నారు. మీరు పాఠశాలల్లో చూపే చొరవ విద్యార్థినుల సమగ్ర వికాసానికి బాటలు వేస్తుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓలు సుమతి, రూత్ ఆరోగ్య మేరీ, రేవతి, సీఎంఓ కరుణాకర్, రీసోర్స్ పర్సన్లు ఉషా మాధురి, పద్మజ, జులేఖా, మాధవి లత, నాగజ్యోతి, భార్గవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆభరణాలు నూతన మఠాధిపతికి అందజేత

**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**
భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం పూర్వపు మఠాధిపతి శివైక్యం చెందినప్పుడు మఠాధిపతి స్వర్ణ ఆభరణాలను లాకర్ లో పెట్టి దేవాదాయ శాఖ అధికారులు సీజ్ చేయడం జరిగినది. నూతన మఠాధిపతులుగా నియమితులైన శ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారికి దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమీషనర్ శంకర్ బాలాజీ, ఇన్స్పెక్టర్ జనార్ధన్, పంచాయితీ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, పోలీస్ వారు మరియు మఠం మేనేజర్ ఈశ్వరయ్య చారి, సిబ్బంది శ్రీనివాసులు, మఠాధిపతి బావమరిది పి పి ఎన్ ప్రసాద్ సమక్షంలో స్వర్ణ ఆభరణాలు అయిన స్వర్ణ కిరీటం,స్వర్ణ రుద్రాక్ష మాల, స్వర్ణకడియాలు, వెండి పాదుకలు,నూతన మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారికి అందజేశారు.



# శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు

**సదుం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**
ఈనెల 15న జరగనున్న శివరాత్రి పండుగను పురస్కరించుకొని సదుం మండలంలోని శివ క్షేత్రాలలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నడిగడ్డ మతుకువారిపల్లి వద్దనున్న శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో, రేగలు రోడ్ ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పరిధిలో ఉన్న మరకత శివలింగం ఆలయంలోనూ, ఎర్రతివారిపల్లె భాస్కర్ రెడ్డి కాలనీలో ఉన్న శ్రీ శ్రీ కన్నెమూల వినాయక దేవస్థానం లోనూ, బూరగమంద పంచాయతీ మరవపల్లె లోని శ్రీ శివకోన సిద్దేశ్వర స్వామి దేవాలయంలోనూ, దిగువ జాండపేటలోని శ్రీ ప్రసన్న పార్వతీ సమేత అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం లో, అదేవిధంగా ఊటుపల్లి పంచాయతీ ఉన్న దేవలం బోర్డులోని మల్లికార్జున స్వామి ఆలయంలోనూ, చెరుకువారిపల్లె శివాలయంలోనూ, సీతమ్మకుట్ట వద్ద నున్న మారుతీ సేవాశ్రమంలోనూ విస్తృత ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో ఆలయాల్లో ఉదయం నుంచి అభిషేకాలు నిర్వహించడమే కాకుండా సాయంత్రం అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం, కన్నెమూల వినాయక స్వామి దేవస్థానం, ఊటుపల్లె మల్లికార్జున స్వామి ఆలయంలోనూ సాయంత్రం కళ్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా సదుంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పరిధిలో ఉన్న మరకత శివలింగమునకు మధ్యాహ్నం మూడు గంటల నుంచి రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం శివపార్వతుల కళ్యాణం తర్వాత అన్న ప్రసాద వితరణ జరగనున్నాయి. ఇందులో భాగంగా విస్తృతంగా అన్నదానాలు నిర్వహించనున్నారు.

## శివరాత్రి వేడుకల్లో ఆరోగ్య నియమాలు పాటిద్దాం

**పీలేరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:**
మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మద్గుండాల మల్లేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు ఆరోగ్య నియమాలు విధిగా పాటించాలని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధి కారులు డా:శ్రీగిరీష కోరారు. శుక్రవారం డాక్టర్ గిరీష ఉత్సవం జరుగు ప్రాంతాల్ని సందర్శించి అక్కడి పరిసరాల పరిశుభ్రత మరియు నిర్వహించే ఉచిత వైద్యశిబిరం ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ, భక్తుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా, దుమ్ము ధూళితో నిండిన తినుబండారాలు విషయములో జాగ్రత వహిస్తూ భక్తితో స్వీకరించే అన్న ప్రసాదాల భుజించే ముందు చేతులు శుభ్రత పాటించాలని,రక్షిత మంచి నీరు త్రాగాలని, లేనిచో టైఫాయిడ్ ,కామెర్లు,నీళ్ల విరేచనాలు,వాంతులు,కడుపునొప్పి మొదలగు అంటువ్యాధులు ప్రబలే పరిస్థితి లేకపోలేదని కావున కలుషిత గాలి,నీరు, ఆహారం,చేతుల ద్వారా సంక్రమించే అంటు వ్యాధులనుండి గౌరవ భక్తుల క్షేమం దృశ్యా సురక్షిత ఆరోగ్య పద్ధతులు పాటిస్తూ మహాశివరాత్రి ఉత్సవాలు జయప్రదం గావించాలని. ఉచిత వైద్య శిబిరాల ఆరోగ్య సేవాల్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా డా:శ్రీగిరీష కోరారు. కార్యక్రమంలో డిప్యూటి హెచ్ఇఓ కొండయ్య ఏఎన్ యం ప్రమీల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

